

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 25-07-2025 | సంపుటి - 24 | సంచిక - 80 రూ : 4 | పేజీలు: 8


## రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు..

### అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

- ఢిల్లీ నుంచే కలెక్టర్లతో సీఎం రేవంత్ సమీక్ష
- కొల్లాపూర్ పర్యటనలో సీఎం రేవంత్ ఉద్ఘాటన



2లో

## క్రికెట్ తరహాలో భారత్-బ్రిటన్ మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం: ప్రధాని

### బ్రిటన్ లో పర్యటిస్తున్న భారత ప్రధాని మోదీ



- చారిత్రక ఒప్పందంపై సంతకాలు
- భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం మొదలైందన్న మోదీ

బ్రిటన్ తో కీలక వాణిజ్య ఒప్పందం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆయన బ్రిటన్ పర్యటనలో ఉన్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదని, అది ఒక ప్యాషన్ అని అభివర్ణించారు. క్రికెట్ తరహాలో భారత్‌బ్రిటన్ దేశాల మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం కోరుకుంటున్నామని తెలిపారు. "ఈ ఒప్పందంతో భారత్‌బ్రిటన్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఇరుదేశాలు విజన్2035 లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. రక్షణ, భద్రత, కృత్రిమ మేధ (ఏఐ), విద్య, సైబర్ సెక్యూరిటీ, ఇతర రంగాల్లో కలిసి ముందుకు సాగాలని నిర్ణయించాం. 6 బ్రిటన్ వర్సిటీలు భారత్ లో క్యాంపస్ లు ఏర్పాటు చేస్తున్నాయి" అని వివరించారు. ఇక, పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన బ్రిటన్ ప్రధానికి ధన్యవాదాలు

తరువాయి 2లో

## క్వాంటం వ్యాలీలో... క్యూపిఐఏఐ భాగస్వామ్యం

- అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు
- చంద్రబాబుతో సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ సమావేశం
- అమరావతిలో ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు చంద్రబాబు సూచన
- 26 నుంచి సింగపూర్ పర్యటనకు చంద్రబాబు
- పెట్టుబడులే లక్ష్యంగా సీఎం పర్యటన



**అమరావతి, జూలై24 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి క్వాంటం వ్యాలీలో క్యూపిఐఏఐ భాగస్వామ్యం కానుంది. నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీలో క్యూపీఐఏఐ కూడా భాగస్వామ్యం వహించనుంది. దీనిలో అధునాతన 8 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఏఐ సంస్థ ముందుకు వచ్చింది. ఈ క్రమంలో అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు

తరువాయి 2లో

## అన్నయ్య.. హ్యాపీ బర్త్‌డే

- నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు
- సోషల్ మీడియా వేదికగా వెల్లువెత్తుతున్న జన్మదిన శుభాకాంక్షలు
- ఎక్స్ వేదికగా అన్నయ్యకు బర్త్‌డే విషెస్ తెలిపిన కవిత




నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు, సన్నిహితుల నుంచి సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కేటీఆర్ సోదరి, ఎమ్మెల్సీ కవిత కూడా ఆయనకు 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. "అన్నయ్య.. మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" అని ట్వీట్ చేస్తూ కేటీఆర్‌ను ట్యాగ్ చేశారు. కాగా, ఇటీవల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ నేపథ్యంలో కేటీఆర్, కవిత మధ్య కాస్త గ్యాప్ వచ్చిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగిన విషయం తెలిసిందే.



2లో

## దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి జెమ్స్ అండ్ జ్యువలరీ పార్కు!: నారా లోకేశ్

- మంగళగిరిలో టాప్-20 జ్యువలరీ సంస్థల యూనిట్లు స్థాపించేలా చర్యలు
- ప్రతిఏటా 4 వేల మందికి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ
- అధికారులతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమీక్ష

## పాకిస్థాన్ కవ్వింపు చర్యలు.. 6 డ్రోన్లను కూల్చివేసిన భారత్

- సరిహద్దుగుండా ఆయుధాలు, మత్తు పదార్థాలు దేశంలోకి పంపించేందుకు పాక్ కుట్ర
- బుధవారం రాత్రి 5 డ్రోన్లను కూల్చివేసిన భారత్
- గురువారం తెల్లవారుజామున మరో డ్రోన్ కూల్చివేత

పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. తాజాగా పంజాబ్‌లోని అమృత్‌సర్ సమీపంలో భారత్‌పాకిస్థాన్ సరిహద్దు గుండా ఆయుధాలు, మత్తు పదార్థాలను మన దేశంలోకి పంపించేందుకు కుట్ర పన్నింది. ఈ క్రమంలో పాకి స్థాన్ పంపించిన ఆరు డ్రోన్లను బీఎస్‌ఎఫ్ కూల్చివేసింది. ఈ ఘటనలో మూడు తుపాకులు, మ్యాగజీన్లతో పాటు ఒక కి

తరువాయి 2లో





## పారిశ్రామికాభివృద్ధికి అపార అవకాశాలు

- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్ : పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయని, ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. గురువారం మాదాపూర్ హెచ్ఐసీసీలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 'ఇన్వెస్టోపియా గ్లోబల్' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మంత్రి మాట్లాడుతూ...''తెలంగాణ

తరువాయి 2లో

# రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షా లు

న్యూఢిల్లీ, జూలై24 : రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీలో ఉన్న ముఖ్య మంత్రి సీఎంవో అధికారులతో మాట్లాడారు. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. దిల్లీ నుంచే సీఎంవో అధికారులతో మాట్లాడారు. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి. నీటి ఉద్ధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రజలకు సాయం చేసేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నందున చెర్వులు, కుంటలు నిండి వరద నీటి ఉద్ధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. భారీ వర్ష సూచన ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం ఆదేశించారు. ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో మాట్లాడి ఎప్పడికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు.

# క్వాంటం వాలీలో... క్యూపిఐఏఐ భాగస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

నాయుడు తెలిపారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అధికారులకు సూచించారు. సిఎం చంద్రబాబుతో క్యూపిఐఎఐ సంస్థ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజన్ సమావేశం అయ్యారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటం వ్యాలీ క్యూపిఐఎఐ సంస్థ భాగస్వామ్యం అయ్యారు. విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం ఆదేశాలిచ్చారు. అధునాతన 8 క్యూబినేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు క్యూపిఐఎఐ సంస్థ ముందుకొచ్చిందని చంద్రబాబు తెలియజేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్‌తో చర్చించారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉపకరించే ఆవిష్కరణలు, అలాగే, విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. దీనితో పాటు అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి క్యూపిఐఏఐను కోరారు. తద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు క్వాంటం అల్గారిథంలు, అప్లికేషన్‌లను రూపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ పంటల సాగులో కచ్చితత్వం, తెగుళ్లకు సంబంధించిన అంశాలను అంచనా వేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తి పెరిగేలా సూచనలు, సలహాలను సకాలంలో ఇవ్వటం ద్వారా రైతుల ఆదాయాలను మెరుగుపడేందుకు ఈ సాంకేతికత దోహద పడాలని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో నీటి వనరులను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా క్వాంటం టెక్నాలజీని వాడాలన్నారు. వ్యాధుల నిర్ధారణ, మెడికల్ లాజిస్టిక్స్ తదితర అంశాల్లోనూ క్వాంటం సిమ్యులేషన్‌ను సమర్థంగా వినియోగించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంలోనూ క్వాంటం టెక్నాలజీ సహకారాన్ని తీసుకునేలా ప్రభుత్వం యోచన చేస్తోంది. క్వాంటం లాంటి ఆధునిక సాంకేతికత ద్వారా సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని మెరుగు పర్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది. విద్య, పరిశోధన, ఇన్నోవేషన్ రంగాల్లో డీప్ టెక్ ద్వారా సమాజానికి విస్తృత ప్రయోజనాలు కల్పించటమే లక్ష్యంగా క్యూపిఐఏఐ, నేషనల్ క్వాంటం మిషన్, అమరావతి క్వాంటం వ్యాలీ పనిచేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# క్రికెట్ తరహాలో భారత్-బ్రిటన్ మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం: ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

తెలుపుకుంటున్నానని వెల్లడించారు. "తీవ్రవాదం విషయంలో రెండు అభిప్రాయాలకు చోటు లేదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛను దుర్వినియోగం చేసేవారి పట్ల కఠినంగా ఉంటాం. పలు దేశాల మధ్య తలెత్తుతున్న ఉద్రిక్తతల పట్ల ఆందోళన చెందుతున్నాం. ప్రపంచ దేశాల మధ్య శాంతి పెంపొందించే విషయంలో భారత్‌బ్రిటన్ కలిసి ముందుకు సాగుతాయి. ఇది విస్తరణ వాదానికి కాలం కాదు... ఇది శాంతికి సమయం" అని మోదీ స్పష్టం చేశారు. అటు, అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపైనా ప్రధాని మోదీ స్పందించారు. "అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో బ్రిటన్ లోని ఎన్నారైలు కూడా ఉన్నారు. విమాన ప్రమాద మృతులకు మరోసారి సంతాపం తెలుపుతున్నాను. ఎన్నారైలు భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారు. బ్రిటన్ ప్రధాని ఆతిథ్యానికి ధన్యవాదాలు... భారత్ కు రావాలని ఆయనను ఆహ్వానిస్తున్నాను" అని పేర్కొన్నారు.

# దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు!: నారా లోకేశ్

దేశంలో అత్యుత్తమ మోడల్ తో మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు నిర్మాణంచేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు ఏర్పాటుపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... మంగళగిరిలో ఏర్పాటు చేయబోతున్న జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కుతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో ఆభరణాల తయారీలో ప్రపంచస్థాయి శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో టాప్ 20 ఆభరణాల తయారీసంస్థలు మంగళగిరి పార్కులో తయారీ యూనిట్లు, రిటైల్ షాపులు స్థాపించేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఉడిపిలోని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యుయలరీ (ఐఐజీజే) పనితీరును అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. దీనిపై స్కిల్ డెవలప్ మెంట్ సీఈవో గణేశ్ కుమార్ స్పందిస్తూ త్వరలో ఏర్పాటుచేసే కామన్ ఫెసిలిటీ సెంటర్ మరియు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ప్రతిఏటా 4 వేలమందికి అధునాతన ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పార్కులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈఓ), కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్ సీ), ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ అండ్ రిటైల్ జోన్, మ్యానుఫాక్చరింగ్ జోన్, రెసిడెన్షియల్ జోన్, ఇన్ ఫ్రా జోన్ అంతర్భాగాలు ఉంటాయని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... మంగళగిరిలో యువతకు నైపుణ్యశిక్షణ అందించే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ) కూడా త్వరితగతిన ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ఎంసీసీ ద్వారా కెరీర్ కోచింగ్, జాబ్ మ్యాచింగ్, స్కిల్ అప్ గ్రేడేషన్, ఎంప్లాయర్ ఎంగేజ్ మెంట్ చేపట్టాలని అన్నారు. మంగళగిరిలో ఇప్పటివరకు చేపట్టిన 3 జాబ్ ఫెయిర్లకు 1,170మంది యువకులు హాజరుకాగా, 453 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు తెలిపారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ... ఇకపై ప్రతినెలా జాబ్ ఫెయిర్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, యువతకు నూరుశాతం ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు.

# పాకిస్థాన్ కవ్వింపు చర్యలు.. 6 డ్రోన్లను కూల్చివేసిన భారత్

(మొదటిపేజీ తరువాయి)

లో హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు బీఎస్ఎఫ్ అధికారులు మీడియాకు వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి అనుమానాస్పద వస్తువులు భారత్ భూభాగంలోకి వస్తున్నట్లు గుర్తించిన బీఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమైంది. అవి పాక్‌కు చెందిన డ్రోన్లుగా గుర్తించి వెంటనే ప్రతిస్పందించి వాటిని కూల్చివేసింది. మోథే సమీపంలో ఐదు డ్రోన్లను కూల్చిన బీఎస్ఎఫ్, మూడు తుపాకులు, మూడు మ్యాగజీన్‌లు, దాదాపు 1.07 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. గురువారం తెల్లవారుజామున అట్టారీ దాల్ గ్రామానికి సమీపంలో మరొక డ్రోన్‌ను కూల్చివేశారు. వీటితో పాటు దాల్ సమీపంలోని పంట పొలాల్లో తుపాకీ విడిభాగాలు, ఒక మ్యాగజీన్‌ను గుర్తించారు.

పల్లా శ్రీనివాసరావు..

# భవనం కూల్చివేత ఘటన.. ఇద్దరు అధికారుల సస్పెన్షన్

విశాఖపట్నం: తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు భవనం కూల్చివేత ఘటనలో మున్సిపల్‌శాఖ చర్యలు చేపట్టింది. ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయగా.. ముగ్గురికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. వైకాపా ప్రభుత్వం హయాంలో 2021లో గాజువాకలో పల్లా శ్రీనివాసరావుకు చెందిన భవనాన్ని అధికారులు కూల్చివేశారు. అక్రమంగా కూల్చివేశారంటూ ఫిర్యాదు రావడంతో మున్సిపల్ శాఖ చర్యలు చేపట్టింది. ఆరో జోన్ అప్పటి టీపీఎస్ వరప్రసాద్, టీపీవో వినయ్ ప్రసాద్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. చీఫ్ సిటీ ప్లానర్ విద్యుల్లత, సిటీ ప్లానర్ ప్రభాకర్, జోనల్ కమిషనర్ శ్రీధర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.




# పారిశ్రామికాభివృద్ధికి అపార అవకాశాలు

(మొదటిపేజీ తరువాయి)

భౌగోళికంగా చిన్నదైనా, ఆశయాలు, ఆచరణలో మాత్రం చాలా పెద్దది. రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యం పెట్టుకున్నాం. డ్రైపోర్ట్‌లు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్ జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో ఫేజ్ 2 తదితరాలన్నీ పారిశ్రామికాభివృద్ధికి మరింత దోహదం చేయనున్నారు. ఫిన్‌టెక్, క్లైమేట్ టెక్, స్మార్ట్ మొబిలిటీ ఆవిష్కరణలకు తెలంగాణ ప్రపంచ కేంద్రంగా మారబోతోంది. డేటా సెంటర్లు, జీసీసీలు, ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోంది. గత 18 నెలల్లోనే తెలంగాణ రూ.3.2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించింది. 202425 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయి. ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే లులు గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి యూఏఐ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాయి'' అని వివరించారు. కార్యక్రమంలో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారి, ఆ దేశ ఉన్నతాధికారులు మహ్మద్ అల్వాహి, వాలిద్ హరేబ్ అల్ ఫలాహి, ఇన్వెస్టోపియా సీఈవో డా.జీన్ ఫారెస్, తెలంగాణ ఉన్నతాధికారులు సంజయ్ కుమార్, కె.శశాంక తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి.. దోస్త్ ప్రత్యేక విడత ప్రవేశాల రిజిస్ట్రేషన్

హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్‌తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కింద ప్రవేశాలకు ఈనెల 25 నుంచి 31 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ఆచార్య బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం షెడ్యూల్‌ను ప్రకటించారు. 'రూ.400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఆగస్టు 3న సీట్లు కేటాయిస్తారు. ఆగస్టు 11, 12 తేదీల్లో ప్రైవేట్ కళాశాలలు స్పాట్ ప్రవేశాలు జరుపుకోవచ్చు. ఇందులో స్థానికేతర విద్యార్థులు కూడా సీట్లు పొందవచ్చు' అని ఛైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు.




# రెండు పడకగదుల ఇళ్లలోనే ఉంటున్నారా?

* 'హౌసింగ్ కాలనీస్ ఇన్‌స్పెక్షన్' యాప్‌తో తనిఖీలు
* రెండు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా విజయవంతం
* త్వరలో రాష్ట్రమంతటా అమలుకు నిర్ణయం

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రెండు పడకల గదుల ఇళ్లలో లబ్ధిదారులు ఉంటున్నారా లేదా? ఇతరులకు అద్దెకు ఇచ్చారా? వేరే వాళ్లకు అనధికారికంగా విక్రయించారా? లీజు ఇతర అవసరాలకు ఈ గృహాలను కేటాయించారా? తదితర అంశాలపై ప్రభుత్వం తనిఖీలకు సిద్ధమైంది. ఇందుకోసం గృహ నిర్మాణశాఖ 'హౌసింగ్ కాలనీస్ ఇన్‌స్పెక్షన్' మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. గత ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లకు సిబ్బంది వెళ్లి ఈ యాప్ ద్వారా విచారణ చేపట్టనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పట్టణాల్లో బ్లాక్ విధానంలో నిర్మించి లబ్ధిదారులకు కేటాయించే ఇళ్లకు ఇది వర్తిసుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్, చెంగిచెర్లలో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్ల వద్ద ప్రయోగాత్మకంగా హౌసింగ్ కాలనీస్ ఇన్‌స్పెక్షన్ మొబైల్ యాప్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. బోడుప్పల్‌లోని 74, చెంగిచెర్లలోని 39 ఇళ్లకు సిబ్బంది వెళ్లి లబ్ధిదారులు ఇంటిలోనే ఉంటున్నారా? లేదా? వివరాలను నమోదు చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో యాప్ తనిఖీలు విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా కూడా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఈ తరహాలో విచారించడానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో 2.36 లక్షల రెండు పడకల గదుల ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో 1.58 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, 1.36 లక్షల మందికి గృహాలను కేటాయించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో పలుచోట్ల కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు ఉండటం లేదని జిల్లాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. పలుచోట్ల సొంత ఇళ్లు ఉన్నవారికి కూడా రెండు పడక గదుల ఇళ్లను కేటాయించారని, వీటిని కిరాయికి ఇచ్చి లబ్ధిదారులు సొంత ఇళ్లలో ఉంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై యాప్ ద్వారా తనిఖీ చేయడానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, జిల్లాల్లో రెవెన్యూ లేదా పంచాయతీ సిబ్బందికి సర్వే బాధ్యతలను అప్పగించనున్నారు.



### యాప్‌లో వివరాల నమోదు

'హౌసింగ్ కాలనీస్ ఇన్‌స్పెక్షన్' మొబైల్ యాప్ ద్వారా సిబ్బంది ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్తారు. అక్కడ లబ్ధిదారులు ఉన్నారా? లేదా? వంటి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఇంటికి తాళం వేసి ఉంటే ఎన్ని రోజుల నుంచి అలా ఉందో? తెలుసుకుంటారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను తీస్తారు. ఆ ఇంటిలో ఎవరుంటున్నారు? లబ్ధిదారుడు ఉంటే పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వారికి కేటాయించిన ఇంటి పట్టాను పరిశీలిస్తారు. ఆ ఇంట్లో ఇతరులు కిరాయికి ఉంటే వారి వివరాలు, ఎన్ని రోజుల నుంచి ఉంటున్నారో సమాచారాన్ని తీసుకుంటారు. కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు లేకపోతే వారికి నోటీసులు ఇస్తారు. వారి నుంచి వచ్చే సమాధానాన్ని బట్టి తదుపరి చర్యలకు అధికారులు సిద్ధమవుతారు.

# ఇందిర రికార్డును అధిగమించనున్న మోదీ

దిల్లీ: ప్రధాని మోదీ ఒక రికార్డు సృష్టించబోతున్నారు. దేశంలో వరసగా ప్రధాని పదవిని చేపట్టి ఎలాంటి విరామం లేకుండా సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న రెండో నేతగా ఇందిరాగాంధీ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించబోతున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. 2014 మే 26న తొలిసారి ప్రధాని అయిన ఆయన శుక్రవారంతో 4,078 రోజులు పూర్తి చేసుకోనున్నారు. దివంగత ఇందిరాగాంధీ 24.01.1966 నుంచి 24.3.1977 వరకు 4,077 రోజులు ప్రధానిగా ఉన్నారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదట ఈ రికార్డు సాధించారు. వరసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీలకు విజయాన్ని సాధించిన ఘనత నెహ్రూ, మోదీలకు దక్కుతుంది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దీర్ఘకాలం కొనసాగిన ఖ్యాతి మోదీకే చెందుతుంది. 2001లో గుజరాత్ సీఎం అయిన ఆయన 2014లో ప్రధాని అయ్యేవరకు ఆ పదవిలో కొనసాగుతూ వచ్చారు.

# దమ్ముంటే బీసీని.. సీఎం చేస్తామని హామీ ఇవ్వండి

- బీసీ రిజర్వేషన్ కాదు.. ముస్లిం రిజర్వేషన్ బిల్లు:
- మూడుసార్లు బీసీని ప్రధానమంత్రి చేసిన ఘనత బిజెపి పార్టీ సొంతం
- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: దమ్ముంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బిసిని సీఎం చేస్తామని హామీ ఇవ్వాలని బిజెపి సీనియర్ నాయకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం హోటల్ హైవే 9 లో నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డితో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన బీసీ రిజర్వేషన్ బిల్లు కాదని, ముస్లిం రిజర్వేషన్ బిల్లు అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి కేంద్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ తుంగలో తొక్కారని ఆరోపించారు. ముస్లిం, మైనార్టీల 10శాతం కలిపి, బీసీ రిజర్వేషన్ 42శాతం బిల్లు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతపరమైన రిజర్వేషన్లు జోడిస్తే రాజ్యాంగం ప్రకారం నిలబడదని, సెక్షన్ 285 ప్రకారం సవరణ చేసి పంపండి, బీసీ బిల్లు పాస్ అవుతుందన్నారు. రాజ్యాంగం ప్రకారం చట్టపరమైన బిల్లు చేయకుండా బీసీ బిల్లును బిజెపి పార్టీ వ్యతిరేకిస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం బీసీల ప్రభుత్వమని, బీసీలకు ఎల్లప్పుడూ అండగా ఉందన్నారు. 27మంది బీసీలను కేంద్ర మంత్రులు చేసిన ఘనత బిజెపి సొంతమన్నారు. మూడు దఫాలుగా బీసీ వ్యక్తి నరేంద్ర మోడీని ప్రధానమంత్రి చేసిన చరిత్ర



బిజెపి పార్టీకుందన్నారు. 42శాతం బీసీలకు రిజర్వేషన్ చేసే వరకు కాంగ్రెస్ పార్టీపై బిజెపి పార్టీ కొట్లాడుతూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు, రమణగోని దీపిక, కట్ట కృష్ణ, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, మన్నె ప్రతాప్ రెడ్డి, రిక్కల సుధాకర్ రెడ్డి, ఊడుగు వెంకటేశం గౌడ్, చినుకని మల్లేశం, శాగ చంద్రశేఖర్ రెడ్డి, కడారి ఐలయ్య, ఉష్కాగుల నాగరాజు, పబ్బు వంశీ, పిల్ల బుచ్చయ్య, ఊదరి రంగయ్య, పాలెం అశోక్, కానుగు కొండల్, బుడ్డ సురేష్, పబ్బతి శేఖర్, పర్నె శ్రీనివాస్ రెడ్డి, పర్నె అంజిరెడ్డి, తొర్పునూరి నరసింహ, ఎర్రగోని మల్లేశం, బంగారు రమేష్, పర్నె శేఖర్ రెడ్డి, గోపనగోని లింగస్వామి, వరగంటి భాను ప్రకాష్, బూత్ అధ్యక్షులు ఇటికల దామోదర్ రెడ్డి, కానుగు శేఖర్, లింగస్వామి, గణేష్, శివ శంకర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# జర్నలిస్టులకిచ్చిన మాట తప్పేది లేదు

* టీయూడబ్ల్యుజే సభలో మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం , ప్రజాస్ఫూర్తి : ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు తమ పార్టీ ఇచ్చిన మాటను తప్పేది లేదని, టీయూడబ్ల్యూజే కోరుతున్న ఆ మూడు సమస్యలకు వీలైనంత తొందరలో పరిష్కారం చూపుతామని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు హామీ ఇచ్చారు. గురువారం వైరాలోని శబరి గార్డెన్స్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఖమ్మం జిల్లా మహాసభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఎన్టిఆర్ ప్రొద్బలంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన తనకు, నాటి నుండి నేటి వరకు జర్నలిస్టులు అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదన్నారు. తాను పదవుల్లో ఉన్నా, లేకున్నా జర్నలిస్టులతో మాత్రం కుటుంబ సభ్యుల బంధాన్ని కొనసాగిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నలభై యేండ్ల తన రాజకీయ జీవితంలో జర్నలిస్టుల కష్టాలను దగ్గరి నుండి పరిశీలిస్తున్నానని, కూటి కోసం కాకుండా సమాజానికి ఏదో మేలు చేయాలనే తపనతో నాడు ఎందరో జర్నలిజం వృత్తిలోకి ప్రవేశించారని, అయితే గత కొంతకాలంగా ఈ వృత్తిలోకి ప్రవేశిస్తున్న కొందరిలో ఆనాటి అంకితాభావం, చిత్తశుద్ధి కన్పించడం లేదని, వ్యక్తిగత ఎజెండాలతో ఈ వృత్తిని ఎంచుకుంటున్నారని ఆయన విచారం వ్యక్తం చేసారు. ఇవ్వాళ ఈ సభలో సీనియర్ పాత్రికేయులను చూస్తుంటే పాత రోజులు జ్ఞాపకం వస్తున్నట్లు మంత్రి తుమ్మల అన్నారు. ఏది ఏమైనా ముఖ్యమంత్రితో చర్చించి జర్నలిస్టుల ప్రధాన సమస్యల పరిష్కారానికి



తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదల వెనక జర్నలిస్టుల ఆశిస్సులు ఉన్నాయన్నారు. ప్రతి అడుగులో జర్నలిస్టులు అందించిన కృషిని జీవితంలో మరచిపోలేనన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు ప్రధాన భూమికను పోషించారని, అలాగే గత ప్రభుత్వ వైఫల్యాలను సైతం నిర్భయంగా ఎత్తిచూపి ప్రజలను చైతన్యపర్చడానికి ఎనలేని కృషి చేసారని ఆయన చెప్పారు. జర్నలిస్టుల రుణాన్ని తీర్చుకోడానికి తాము వెనకాడేది లేదని, ఖచ్చితంగా యూనియన్ నాయకులతో సమావేశమై సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులను వీలైనంత తొందరలో జారీ చేసేందుకు చర్యలు చేపడతామని పొంగులేటి హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ గత పదేళ్లుగా విస్మరించబడుతున్న జర్నలిస్టుల ప్రధాన సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని జర్నలిస్టులు ఆశపడ్డారని, అయితే అధికారాన్ని చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా ఏ ఒక్క సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. ఏడాదిన్నర పాటు పాత అక్రెడిటేషన్ కార్డులను రెన్యూవల్ చేసుకుంటూ పోవడం సరైంది కాదన్నారు. వెంటనే కొత్త కార్డులను జరీచేయాలనీ కోరారు. డెబ్భై యేండ్ల పోరాట చరిత్ర కలిగివున్న తమ సంఘం లెక్కలేనన్ని ఉద్యమాలు చేసి హక్కులను సాధించుకుంటున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేసారు. తెలంగాణ రాష్ట్రంలో 14000 సభ్యత్వాలతో, అత్యధిక జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తూ, దేశంలోనే తమ సంఘం అగ్రగామిగా నిలబడడం ఎంతో గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నది టీయుడబ్ల్యూజే ఐజేయు సంఘం మాత్రమేనన్నారు. జర్నలిస్టులకు, మీడియా సంస్థలకు ఎలాంటి కష్టం వచ్చినా నాటి నుండి నేటివరకు తల్లి పాత్ర పోషిస్తున్నది తమ సంఘమే అన్నారు. గత కొన్నేళ్లుగా జర్నలిస్టులు అనుభవిస్తున్న వివిధ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో, సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ రాగమయి, వైరా శాసన సభ్యులు రాందాస్ మారోత్, జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర నాయకులు వేణు, నర్వనేని వెంకట్రావు, రవీంద్ర శేషు, జిల్లా నాయకులు జ్యోతి వెంకట్రావు, పాపారావు, మురళి, సైదులు, శ్రీనివాస్, ఖాదర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టులతో కళకళలాడిన వైరా**

గురువారం జరిగిన టీయూడబ్ల్యుజే ఖమ్మం జిల్లా మహాసభకు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో వైరా పట్టణం కళకళలాడింది. భారీ వర్షాన్ని సైతం లెక్కజేయకుండా జిల్లా పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల నుండి దాదాపు 600మంది జర్నలిస్టులు ర్యాలీలతో తరలిరావడం విశేషం.

## మాజీ మంత్రి కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్చం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## హరిహర వీరమల్లు చిత్రం విజయోత్సవ సంబరాలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల కేంద్రంలో శ్రీనివాస థియేటర్ లో పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం గురువారం విడుదలైంది. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ నటించిన తొలి పిరియాడికల్ డ్రామా హరిహర వీరమల్లు సినిమా కావడంతో అభిమానులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. విజయోత్సవ సంబరాల్లో భాగంగా పర్నె శివారెడ్డి కేక్ చేశారు. ఈ కార్యక్రమంలో మర్ల శ్రీశైలం, రెహాన్, మహేష్, రాజు, సంజయ్, అనిల్, వంశీ, జనసైనికులు అభిమానులు పాల్గొన్నారు

## శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం ఆవరణలో హరితహారం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం శివారులోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం ఆవరణలో హరితహారం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా దేవస్థానం ప్రాంగణంలో దేవస్థానం చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి, కార్యనిర్వహణాధికారి ఎస్ మోహన్ బాబుల చేతుల మీదుగా వివిధ రకాల 100మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుర్ర స్వామి, అత్తాపురం అంజిరెడ్డి, చిట్టంపల్లి జంగయ్య, కంచర్ల ప్రవీణ్ రెడ్డి, సోమ రాఘవేందర్ రెడ్డి, ఎలవర్తి రవీందర్, గుండ్ల అశోక్, ఎల్లంకి రమేష్ చారి, సంగం యాదమ్మ మల్లేష్, ఫకీరు గణేష్ రెడ్డి, చేపూరి మహేష్, ఈడ్దుల లింగస్వామి, పబ్బు కిరణ్ గౌడ్, శివప్రసాద్ శర్మ అర్చకులు, సిబ్బంది గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్..**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి అని, అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించండి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరదలు సంభవించే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహ సమయంలో నదులు, కాలువలు, చెరువులు వంటి జలవనరుల వద్దకి వెళ్లకూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని స్పష్టం చేశారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న చోట్ల అధిక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలి

* ఖుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ కు వినతి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఖుత్బుల్లాపూర్ టీఎస్యుటీఎఫ్ అధ్యక్షులు యస్ పురుషోత్తం అన్నారు. గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి మేడ్చల్ జిల్లా, ఖుత్బుల్లాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఖుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, పెండింగ్ డీఎ లు , పీఆర్సీ ని వెంటనే ప్రకటించాలన్నారు. , పాఠశాల ల్లో మౌళిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం పై ఒత్తిడి పెంచే లక్ష్యం లో భాగంగా ఖుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమం లో టీఎస్ యుటిఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జయసింహారెడ్డి, ఖుత్బుల్లాపూర్ మండల శాఖ అధ్యక్షులు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి , మండల కార్యదర్శులు సంతోష్, రాజశేఖర్, అరుణ కుమారి, సరస్వతీ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పటంలోనే హైదరాబాద్ కు బ్రాండ్ ఇమేజ్ తెచ్చిన నాయకులు కేటీఆర్

* బీఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఐటీ పరిశ్రమలకు హైదరాబాద్ ను కేంద్ర బిందువుగా అభివృద్ధి పరిచి పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చి ప్రపంచ పటంలోనే హైదరాబాద్ కు బ్రాండ్ ఇమేజ్ తెచ్చిన నాయకులు కేటీఆర్ అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలలో భాగంగా బహదూర్ పల్లి లోని కెఎం.పాండు మెమోరియల్ వొకేషనల్ జూనియర్ కళాశాలలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సౌజన్యంతో నిర్వహించిన "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకుల ద్వారా వొకేషనల్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు.అనంతరం విద్యార్థుల సమక్షంలో కేక్ ను కట్ చేసి, కళాశాల ఆవరణలో చెట్లను నాటి కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ ఇలాంటి



జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, నాయకులు సగ్గిడి పద్మా రావు, సత్యనారాయణ, మురళీ, దామోదర్, నారాయణ రావు, వొకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ మైమూన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గుత్తా లింగారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మాజీ ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డి మామ, చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్ళసింగారం గ్రామానికి గుత్తా లింగారెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం లింగారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతకుముందు గుత్త లింగారెడ్డి పార్థీవ దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ తదితరులున్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**: బొంతు శ్రీదేవి యాదవ్**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : గత కొన్ని రోజులుగా హైదరాబాదులో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సూచించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్, గాంధీనగర్, మారుతినగర్, ద్వారకాపురి, ఐ.జి కాలనీ ప్రాంతాల్లో కూలిన చెట్లు, వరద నీటి నిల్వలు, కాలువల పరిస్థితులను సంబంధిత అధికారులతో కలిసి ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ వర్షాల సమయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి రహదారులపై జాగ్రత్తగా కదలాలి ఎటువంటి ఎమర్జెన్సీ అయిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి అని తెలిపారు. అధికారులను వేగంగా స్పందించాలంటూ ఆమె సూచించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని రంగంలోకి దించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం తాను స్వయంగా పర్యవేక్షణ చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ



గుప్త, చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు ఉప్పల ఆంజనేయులు గుప్త, మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఏనిశెట్టి రమేష్ గుప్త, రాయికంటి వేణు గుప్త, సభ్యులు రాయల శ్రవణ్ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త, పెద్ది నవీన్ గుప్త, నీలా శివకుమార్ గుప్త, కొకల కృష్ణమూర్తి గుప్త, పొద్దుటూరి వెంకటేశ్వర్లు గుప్త, రాజూరి జగదీశ్ గుప్త, కందె శివగుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, కోదూరి లక్ష్మణ్ గుప్త, వివివి కృష్ణ గుప్త, బుస్స శ్రీనివాస్ గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, పసునూరి వెంకటేశం గుప్త, దాచా ప్రసాద్ గుప్త, గజ్జల రమేష్ గుప్త, గుబ్బ రామచంద్ర గుప్త, పొద్దుటూరి శ్రీధర్ గుప్త, బెల్లీదే భగవాన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

**- ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాట్ నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి తో కలిసి కేక్ కట్ చేశారు. ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు. అనంతరం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలోని రోగులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అల్మాస్ పేట కిష్టయ్య, మున్సిపల్ యూత్ అధ్యక్షుడు తొర్పునూరు నరసింహ గౌడ్, నాయకులు చిన్నం బాలరాజు, యాట యోగానందం, మెట్టు మహేశ్వర్ రెడ్డి, కొత్త పర్వతాలు, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, హతహర్ పాషా, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, ఢిల్లీ శంకర్ రెడ్డి, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, కానుగు బాలరాజు, బాతరాజు యాదయ్య, లింగస్వామి, ఎండి ఇబ్రహీం, వలందాస్ సతీష్ గౌడ్, ముదిగొండ వెంకటేష్, రమణగోని రఘు, బక్కతట్ల లింగస్వామి, దోనూరి జంగారెడ్డి, ముషీర్, మున్నా, లింగస్వామి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద కొండూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా గూడూరు బాలవర్ధన్ రెడ్డి





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా గూడూరు బాలవర్దన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన గ్రామ శాఖ అధ్యక్షుడు గూడూరు బాలవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి గ్రామస్థాయిలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికలకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల కన్వీనర్ పబ్బు బాబు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బద్దం పాండురెడ్డి, మండల ప్రచార కార్యదర్శి యాస నరసింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బద్దం భూపాల్ రెడ్డి, నారాయణరెడ్డి, వాకిటి రాజేందర్ రెడ్డి, గూడూరు నవీన్ రెడ్డి, బద్దం ప్రవీణ్ రెడ్డి, వాకిటి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణలో అభివృద్ధి సంక్షేమం రెండు చేసి చూపించిన ఘనత బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటి మంత్రి కేటీఆర్ కే దక్కుతుందని మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు బిఎస్ఎన్ కిరణ్ యాదవ్ అన్నారు. కల్వకుంట్ల తారక రామారావు 49వ జన్మదినం సందర్భంగా గురువారం విద్యా వికాస్ స్కూల్ లోని పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి కేటీఆర్ కి శుభాకాంక్షలు తెలిపారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని ఈసారి కేటీఆర్ ఆధ్వర్యంలో అంతకుమించి అభివృద్ధి చేసి చూపిస్తారని ఈ సందర్భంగా కిరణ్ యాదవ్ తెలిపారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు కలిదిండి రోజా, గోపరాజు శ్రీనివాస్ రావు, రాజేష్, శ్రీశైలం, కాసాని శ్రీధర్, నర్సింగ్, గంగారం నర్సింగ్, రాజు, గంగు యాదవ్, సీమల రమేష్, హనుమంతు, ఎల్లేష్, రాజు వడ్డె రాజ్ బీఆర్ఎస్వి, మెడ్ ప్లస్ శీను, గోల్కొండ రవి, వసీం, తదితరులు పాల్గొన్నారు.

## ఆన్ లైన్ తరగతులు ఉపయోగించుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం, ఖాన్ అకాడమీ సంయుక్త నిర్వహణలో కేజీబీవీ విద్యార్థులకు 6 నుండి 12వ తరగతి వరకు భౌతిక రసాయన శాస్త్రాలు, గణితం పై ఆన్లైన్ క్లాసులు నిర్వహిస్తున్నదని, దీనిని విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకొని మంచి విద్యాసామర్థ్యాలు సాధించడంతోపాటు పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విద్యార్థినులకు సూచించారు. పాల్వంచలోని కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన అక్కడ పిల్లలు ఖాన్ అకాడమీ ద్వారా ఏర్పాటైన ఆన్లైన్ తరగతులను, వాటిని పిల్లలు వినియోగిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యాలయంలోని గ్రంథాలయాన్ని కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి పిల్లలకు అవసరమైన పుస్తకాలను ఎక్కువగా తప్పించుకోవాలని ఏమేమి పుస్తకాల అవసరం పిల్లలకు ఉండదు ఆ పుస్తకాల జాబితాను తనకు అందజేయాలని, అదేవిధంగా ప్రస్తుతం ఉన్న ఏడు కంప్యూటర్లకు తోడు ఇంకా ఎన్ని కంప్యూటర్లు అవసరము తెలియజేస్తే వీటన్నింటినీ అందజేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. పాఠశాలకు కావలసిన మౌలిక వసతుల విషయంలో ఎటువంటి రాజీ పడకుండా అవసరమైన అన్ని వస్తువులు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అదేవిధంగా పాఠశాలకు కావలసిన ఇంటర్నెట్ సౌకర్యాన్ని కూడా కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పాల్వంచ కేజీబీవీని ఒక మోడల్ కేజీబీవీ గా అభివృద్ధి పరిచి రాష్ట్రంలోని ఉన్నత స్థాయిలో నిలబెట్టడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వరచారి, జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి ఏ. నాగరాజు శేఖర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్ కే సైదులు, బాలిక విద్య కోఆర్డినేటర్ జె. అన్నామని, విద్యాసాక్ ఇంజనీరింగ్ అధికారులు, పాల్వంచ తాసిల్దార్ పాల్గొన్నారు.

## గుంతల' వంతెనలు నిత్యం తప్పని తిప్పలు..!





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో జాతీయ రహదారులన్నీ గుంతల మయంగా మారాయి. ముఖ్యంగా వంతెనలపై పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చినుకుపడితే చిత్తడిగా మారిపోతున్నాయి. ఎక్కడ గుంతలు ఉన్నాయో కూడా కనపడని పరిస్థితి ఉంటుంది. గుంతల్లో నీళ్లు నిండిపోయి అక్కడ గుంతలు ఉన్నాయనే విషయం తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలు, కార్లు వంటి వాహనాలు గుంతల్లో నుండి వెళ్లి ఎగిరిపడుతున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు మాత్రం గుంతలను గమనించకపోవడంతో అందులో వాహనాలు ఇరుక్కోవడం లేదా ప్రమాదానికి గురై గాయాలపాలవడం నిత్యకృత్యమైంది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని రామవరం గోధుమవాగు వంతెన, లక్ష్మీదేవిపల్లిలోని ముర్రేడు వంతెనల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ రెండు వంతెనలు జాతీయ రహదారిలో ఉండగా ఇటీవల పాత వంతెనలకు అనుబంధంగా కొత్త వంతెనల నిర్మాణం జరిగింది. అయితే ఆ కొత్త వంతెనలు సైతం లోపబూయిష్టంగానే ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు వంతెనల మీదుగా వన్‌వే ఏర్పాటు చేయడంతో ఆయా పాత వంతెనల మీదుగా రాకపోకలు సాగించే వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వర్షం కారణంగా ఎక్కడ గుంతలు ఉన్నాయనే విషయం అర్థం కాక కొందరు వాహనదారులు నెమ్మదిగా వెళ్తుంటే, మరికొందరు వేగంగా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. గత నాలుగు రోజులుగా కొత్తగూడెం పట్టణంలో భారీ వర్షం కురవడంతో రామవరంలోని గోధుమవాగు వంతెనపై ఉన్న గుంతల్లో భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. దీంతో అక్కడి గుంతలు కనపడకపోవడంతో ఓ వాహనదారుడు ఆ గుంతల గుండా వాహనాన్ని తీసుకువెళ్లడంతో బోల్తాపడి గాయపడ్డాడు. దీంతో తనలా మరెవరూ గుంతలో పడి గాయపడవద్దని భావించి పక్కనే ఉన్న కంకరను గుంత వద్ద పోసి, ఒక కొమ్మను ఏర్పాటు చేశాడు. కొద్దిసేపు అక్కడే ఉండి పలువురు వాహనదారులకు అక్కడ గుంతలు ఉన్నాయని తెలియపరుస్తూ పక్కకు వెళ్లమని సూచిస్తూ వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చూశాడు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు వంతెలపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## ఉప్పల్‌లో ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కాప్రా :తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు 49వ పుట్టినరోజు సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మల్లాపూర్ వార్డ్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక ప్రజలతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణపై అవగాహన కలిపించారు.అలాగే నాచారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి, సామాజిక సేవలో పార్టీ కట్టుబాటును గుర్తుచేశారు. అనంతరం హబ్సిగూడ X రోడ్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కేక్ కట్టింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, డివిజన్ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యువజన విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమాజంలో సేవా కార్యక్రమాలు ముఖ్యమైనవి



ప్రజాస్ఫూర్తి , కాప్రా : కుషాయిగూడలోని పోచమ్మ గుడి ప్రాంగణంలో గురువారం అమావాస్యను పురస్కరించుకుని మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత మహిళా కార్యకర్తలతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు.ఆ తరువాత భక్తులకు అన్నదానం నిర్వహించబడింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. సమాజంలో సేవా కార్యక్రమాలు ముఖ్యమైనవని, అలాంటి పనుల్లో పాల్గొనడం ఆనందదాయకమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మారుతి మిత్ర మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి హనుమంతు వరగంటి, కోశాధికారి మచ్చ బాబు గౌడ్, సభ్యులు కాసుల సురేష్, అల్లాదుర్గం సతీష్, అంజి యాదవ్, సింగిరెడ్డి వికాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య అన్నదాన సేవలో వాసవి మిత్రమండలి




ప్రజాస్ఫూర్తి , కాప్రా : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్ వద్ద అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి3 న్యూస్ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త హాజరయ్యారు.అన్నదాతలుగా పెద్ది నిఖిల్ గుప్తా, మౌనిక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కుషాయిగూడ ప్రాంతానికి చెందిన పేద వృద్ధురాలు మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మ లకు వాసవి మిత్రమండలి తరపున ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున పింఛిని అందజేయడం జరిగింది.

## బోడుప్పల్లో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు




మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు. ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పార్టీ జనరల్ సెక్రటరీ మీసాల కృష్ణా మాజీ మేయర్ సామల బుచ్చి రెడ్డి పార్టీ నాయకులు కొత్త చెక్రపాణి గౌడ్ కాటేపల్లీ రాంచందర్ రెడ్డి కొత్త రవి గౌడ్ శ్రీధర్ గౌడ్ నాగేశ్వర్ గౌడ్ పార్టీ నాయకులు యువజన నాయకుకు డివిజన్ ఇంచార్జులు డివిజన్ ప్రెసిడెంట్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేయడానికి జర్నలిజం వారధి

*** సమాచార ప్రత్యేక కమిషనర్ ప్రియాంక**







హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు చేర వేయడానికి జర్నలిజం వారధి అని సమాచార ప్రత్యేక కమిషనర్ ప్రియాంక అన్నారు. గురువారం నాంపల్లి మీడియా అకాడమీలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు... అకాడమీకి అన్ని విధాలుగా మద్దతు ఇస్తామని ఆమె అన్నారు. జర్నలిస్టుల ప్రయోజనం కోసం అవసరమైన సౌకర్యాలను అందించడంలో మీడియా అకాడమీ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పాత రోజుల్లో వార్తలను అందించే పద్ధతి చాలా కష్టంగా ఉండేదని, కానీ ఇప్పుడు వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా వార్తల సమాచారం అందరికీ సెకన్లలో చేరుతుందని ఆమె అన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల మధ్య జరిగే ప్రతి విషయాన్ని ప్రజలకు అందించడంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనదని ఆమె అన్నారు. ఈ సమాజంలో ఏమి జరిగిందో ప్రజలకు నిక్కచ్చితంగా, నిజాయితీగా తెలియజేయాలని, మీరు అందించే సమాచారం ఆధారంగానే ప్రజలు విషయాలు తెలుసుకుంటారని ఆమె అన్నారు.అకాడమీ ద్వారా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు పెన్షన్ అందించడం, వారికి సహాయం చేయడం వల్ల చాలా మంది పిల్లల చదువుకు గొప్ప ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని, వారికి సంబంధించిన బీమా పథకంలో ఉన్న లోపాలను సరిదిద్ది సక్రమంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. విధుల్లో ఉండి ప్రమాదాల్లో గాయపడి పని చేయలేని వారికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ప్రభుత్వం అనేక ఇతర సంక్షేమ పథకాలను అందిస్తుందని, ప్రభుత్వం తన శాఖ ద్వారా జర్నలిస్టులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తుందని ఆమె అన్నారు. అనంతరం పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ప్రమాదాలకు గురై పని చేయలేని 180 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అదేవిధంగా మరణించిన వారి కుటుంబ సభ్యులకు అకాడమీ రూ. 3 వేల పెన్షన్ అందిస్తుందని చెప్పారు. వారి పిల్లల ఎల్‌కేజీ నుండి 10వ తరగతి వరకు చదువుకు అవసరమైన ఫీజులను అకాడమీ చెల్లిస్తుందని ఆయన అన్నారు. ఈ అకాడమీ ద్వారా ఎడిటర్లు, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణ తరగతులు, సెమినార్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు, 4 జిల్లాల్లో శిక్షణ తరగతులు, సెమినార్ లు నిర్వహించామని అన్నారు. మరో మూడు రోజుల్లో, నైపుణ్యం కలిగిన జర్నలిస్టులకు శిక్షణ ఇవ్వడానికి మరికొన్ని జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రసంగాలలో దిశ ఎడిటర్ మార్కండేయ వార్తలు, కథనాలపై సంక్షిప్త ప్రజెంటేషన్లు ఇచ్చారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద రెడ్డి క్రైమ్ న్యూస్ పై, 99 టీవి చీఫ్ ఎడిటర్ బాలనారాయణ శిక్షణా తరగతులలో డిజిటల్ మీడియాపై ప్రసంగించారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా డీఆర్డిఎ పిడి శ్రీలత పాల్గొని డీఆర్డిఎ విధానాలను, సెర్ప్ ద్వారా మహిళలకు అందించే వడ్డీ లేని రుణాలను వివరించారు. అనంతరం శిక్షణ పొందిన జర్నలిస్టులకు సర్టిఫికెట్లను అంద జేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా ప్రజా సంబంధాల అధికారి పి.సి. వెంకటేశం,టీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి కె. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.డి. సలీంపాషా, కార్యదర్శి ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

*** మరొకరిని నిర్దోషిగా విడుదల**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో గండుగులపల్లికి చెందిన వట్టి నాగేశ్వరరావు తన కూతురు వెంకటలక్ష్మి అలియాస్ సుధను మంగపేట మండలం, తిమ్మంపేటకు చెందిన బత్తుల సాంబయ్య కుమారుడగు శ్రీనివాస్‌కు ఇచ్చి 16 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వారికి కుమారుడు బత్తుల కార్తీక్ ఉన్నారు. వీరు మణుగూరులో నివాసం ఉంటున్నారు. తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. భర్త శ్రీనివాస్ భార్యను అదనపు కట్నం కోసం వేధించడం, మరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేయగా, ఇరువురికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో సజావుగా కాపురం చేస్తానని శ్రీనివాస్ చెప్పడంతో భార్య కేసు వెనక్కి తీసుకుంది. కాగా శ్రీనివాస్ భార్యపై కోపంతో తనను ఎలాగైనా వదిలించుకోవాలనేఉద్దేశ్య,తో 2020 సెప్టెంబర్ 10న భార్యతో గొడవపడ్డాడు. మరుసటిరోజు తెల్లవారుజామున 5:30కు శ్రీనివాస్ తన భార్యపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చడంతో భార్య మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు మణుగూరు పోలీసులు బత్తుల శ్రీనివాస్, కుక్కు నూరు సరిత అను వారిపై కేసు నమోదు చేశారు. అప్పటి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఏం . ఏ.షుకూర్ కేసు నమోదు చేసుకొనగా మరో సీఐ ఆర్. భాను ప్రకాష్ దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. 13 మంది సాక్షులను విచారించిన అనంతరం, ఇరుపక్షాల వాదనలు విని బత్తుల శ్రీనివాస్‌పై నేరం రుజువు కాగా, 498(ఎ) ప్రకారము 3 సంవత్సరములు కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా, బిఎన్ఎస్ 302 ప్రకారము జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించ వలెనని పేర్కొన్నారు. కుక్కునూరు సరితను నిర్దోషిగా విడుదల చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి వాదనలు వినిపించారు. కోర్టు నోడల్ ఆఫీసర్ జి. ప్రవీణ్ కుమార్, లైజన్ ఆఫీసర్ ఏన్. వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పిసి. అశోక్ లు సహకరించారు.

# దేశ ప్రజల మనుగడకు కమ్యూనిస్టులే దిక్సూచి

**: కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దేశప్రజల మనుగడుకు కమ్యూనిస్టులే దిక్సూచి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక పద్మశాలి భవన్లో కొత్తగూడెం పట్టణ 27 మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ బజార్ సెంటర్ నుండి భజనమందిర్ వరకు ఐదువేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు నృత్యాలతో అలరించారు. పట్టణంలోని అన్ని కార్మిక వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కొత్తగూడెం వీధులన్నీ ఎర్రజెండాలతో రెపరెపలాడాయి. సభా ప్రాంగణం వద్ద అరుణ పతాకాన్ని కూనంనేని ఆవిష్కరించిన అనంతరం అమరులకు నివాళ్లర్పించారు. మునిగడప వెంకటేశ్వర్లు, కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ ఈ ప్రాంతంతో 45 ఏళ్ల అనుబంధం ఉందని, ఈ సుదీర్ఘ రాజకీయప్రస్థానంలో అనేక ఆటుపోట్లు చవిచూసి ప్రాణాలకు తెగించి పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. కమ్యూనిస్టు ఐఖ్యబలంతో అనేక కాలనీలను నిర్మించామని, ఇప్పుడు ఆ కాలనీల్లో ప్రజలు సుఖ సంతోషాలతో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు నా పై ఉన్న ప్రేమానురాగాలకు కట్టుబడి ఉంటాని,తనపై నమ్మకంతో ఎంఎల్ఎస్ఐగా రెండు పర్యాయాలు గెలిపించిన ప్రజల రుణం తీర్చు కుంటానన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడి సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని, వాటిని తప్పికొట్టాలన్నారు. మోడిపాలకు వ్యతిరేకంగా ఈనెల 9న ఇచ్చిన సమ్మెపిలుపు దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడే అంశమని, వేలాది మంది కార్మికులు రోడ్లపైకి వచ్చి నిరసనతెలిపారని చెప్పారు. ఓట్ల రాజకీయాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రశ్నించేవారిని జైళ్లలో పెడుతూ ఇడి, సిబిసిఐడి పేరిట దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లో అతితక్కువ శాతం ఓట్లు వచ్చిన వారే పాలిస్తున్నారని, ఎన్నికల్లో దామాషా పద్ధతిలో ఓట్లను లెక్కించి దాని ప్రకారమే పదవులు ఇవ్వాలన్నారు. కొత్తగూడెం పూర్తిగా పారిశ్రామిక ప్రాంతమని, ఇక్కడి అనేక మంది కార్మికులు జీవనం సాగిస్తుంటారని, కార్మికుల శ్రేయస్సుకు కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా కొత్తగూడెం కేంద్రంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు మార్గం సుగుమమైందన్నారు. కాలనీలు,తండాలు, బస్తీల్లో మౌళిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నామని, అందుకు పనులు కూడా సాగుతున్నాయన్నారు. పలు రకాల నిధులను తెప్పించి మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలో జరగబోయే కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ పార్టీని అగ్రభాగాన నిలిపి కొత్తగూడెంలో ఎర్రజెండాను మరోసారి ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతాభివృద్ధికి ఎంతో మంది కమ్యూనిస్టు నాయకులు త్యాగాలు చేశారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ ముందుకు సాగుదామన్నారు. సిపిఐ పోరాటాల ఫలితంగా 1 లక్ష 50 వేల ఎకరాలకు పోడు భూములకు పట్టాలొచ్చాయని, ఎంతో కాలంగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్న జర్నలిస్టుల కలను త్వరలో నెరవేరుస్తామని, ఇప్పటికే స్థల సమీకరణ జరిగినందున దానిని వీలైన పద్ధతిలో ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ కమ్యూనిజానికి అంతంలేదని, ఎర్రజెండా నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటుందన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం చిరస్మరణీయంగా ఉందని, రాబోయే వందేళ్లపాటు పేదల పక్షానే పోరాటాలు చేస్తుందని చెప్పారు. స్థానిక ఎన్నికల సమరానికి ప్రతీ కమ్యూనిస్టు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, చలిగంటి శ్రీనివాసరావు, రమణమూర్తి, వంగా వెంకట్, లక్ష్మీ పతి, వీరస్వామి, కందుల భాస్కర్, గెద్దాడ నగేష్, కరీష రత్నకుమారి, గడ్డం రాజయ్య, లక్ష్మీ, భాగం మాధవరావు, దారా శ్రీనివాస్, మాజీ వార్డు కౌన్సిలర్లు ఈసఫ్, మాచర్ల శ్రీనివాస్, చారీ, విజయ్,మునిగడప పద్మ, ధర్మరాజు, నెరేళ్ల రమేష్, బత్తుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కాప్రా : తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 49వ జన్మదినాన్ని ఉప్పల్ నియోజకవర్గంలో ఘనంగా జరిపారు. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నేతలు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను నిర్వహించారు. కేటీఆర్ సేవల పట్ల తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తూ కార్యకర్తలు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంలో ప్రజల శ్రేయస్సు కోసం కేటీఆర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు నేతలు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పాండాల శివకుమార్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డప్పు గిరిబాబు, నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బి. రాజు గౌడ్, బి. శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ యువజన విభాగం, మహిళా విభాగం నాయకులు కూడా ఈ వేడుకల్లో చురుకుగా పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

*** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒక ప్రకటనలో వివరించారు. వాగులు, వంకలు, నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉంటుందని, వాటి వద్దకు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. రైతులు పొలాల్లో, విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గానీ, వైర్లను గానీ చేతులతో తాకవద్దని సూచించారు. మానేరు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలాశయాలు, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్ద మత్స్యకారులు, ప్రజలు ఎవరూ కూడా చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లరాదని అన్నారు. వర్షం వల్ల వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉందని, కావునా పరిమిత వేగంతో నడపాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా అత్యవసరమైతే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని సూచించారు. పిల్లలు , యువకులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈతలు కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. విపత్కర సమయాల్లో సహాయం కోసం డయల్ 100కి లేదా దగ్గరలో ఉన్న పోలీసు వారికి సమాచారం అందించాలని, తక్షణ సహాయ చర్యలు చేపడుతామని తెలిపారు.

## ఘనంగా మాజీ మంత్రి కెటీఆర్ జన్మదిన వేడుకలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : మాజీ మంత్రి కెటీఆర్ తెలంగాణను ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా చేశారని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం వివేకానంద నగర్ డివిజన్ బాగ్ అమీర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు , స్థానిక నాయకులతో కలసి కార్పొరేటర్ కేక్ కట్ చేసి,గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా భాగ్ అమీర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, ఇండోర్ క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ తన నాయకత్వ విజ్ఞానంతో, ప్రత్యేక దూరదృష్టితో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కేటీఆర్ కి ఆయురారోగ్యాలు, సంతోషాలు, విజయాలు అలవరచాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధిలో ఆయన మరిన్ని ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు ,తీగల కృష్ణారావు, బాబు,జగదీష్ గౌడ్, రవీందర్ రావు, నరహరి , హరీష్ ,విష్ణు ,సంతోష్ ,మాధవి రెడ్డి, శైలజ ,అనిత, రాధిక, శ్రావణి,తదితరులు పాల్గొన్నారు..

## జువైనల్ హోం నుంచి ఐదుగురు బాలురు పరారీ



సైదాబాద్ (హైదరాబాద్): నగరంలోని సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని జువెనైల్ హోం నుంచి ఐదుగురు బాలురు పరారయ్యారు. ఈనెల 21న రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. 16 17 ఏళ్ల వయసున్న వీరిలో ఇద్దరు ఏపీకి చెందినవారు కాగా.. ముగ్గురు తెలంగాణ వాసులు. రాత్రి భోజన సమయంలో సిబ్బంది కళ్లుగప్పి ఈ ఐదుగురు బాలురు గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకి వెళ్లారు. వీరి కదలికలు సిబ్బందికి కనబడకుండా మరో ఇద్దరు అడ్డుగా నిల్చున్నారు. దీంతో పథకం ప్రకారం.. మొదటి అంతస్తులోని గేటు తాళం విరగొట్టి పైనుంచి దూకి పారిపోయారు. బాలుర పరారీపై సంబంధిత అధికారి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి చిన్నారి ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలి

* **అధికారులను ఆదేశించిన జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ రాధికా గుప్తా**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి): ప్రతి చిన్నారి ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్బిఎస్ కె (రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం) టీమ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలపై వివరంగా అడిగి తెలుసుకున్నారు. పిల్లల , కిశోరుల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స కల్పించే




విధానాన్ని బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డా. సి. ఉమా గౌరి జిల్లాలో పనిచేస్తున్న ఆర్బిఎస్ కె టీమ్‌ల నిర్మాణం, విధులు , రోజువారీ కార్యాచరణ గురించి అదనపు కలెక్టర్‌కు వివరంగా వివరిం చారు. అనంతరం, ఆంగన్‌వాడీ ఆరోగ్య స్క్రీనింగ్, కంటి పరీక్షలు , వికాస ఆలస్యం గుర్తింపుపై సమీక్ష నిర్వహించారు. డిఈఐసీ (నిలోఫర్ ఆసుపత్రి)కు రిఫర్ అయిన కేసుల సంఖ్య, ప్రస్తుతం చికిత్స పొందుతున్న కేసులు, ఫాలోఅప్ ప్రక్రియపై అధికారులు సమాధానం ఇచ్చారు. రంగస్థాయిలో చికిత్సా సేవలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఫీల్డ్ లో ఎదురవుతున్న సమస్యలు, వారి అనుభవాలను పంచుకుంటూ, సమన్వయంతో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రతి చిన్నారి, కిశోరుడు ఆరోగ్యంగా ఉండేలా కృషి కొనసాగించాలని సూచించారు.ఈ సమీక్షలో కీసర , మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డా. శోభా డా. సత్యవతి, జిల్లా టీకా అధికారి డా. వి. కౌశిక్, ఆర్బిఎస్ కె టీమ్ సభ్యులు, వైద్య అధికారులు, ఫార్మసిస్టులు ఎఎన్ఎం లు పాల్గొన్నారు.



# నిరుపేద శ్రీ వైష్ణవులను ప్రభుత్వం ఆదుకోవాలి

* **శ్రీ వైష్ణవ కుటుంబాలకు ఉచితంగా ఇండ్లను మంజూరు చేయాలి**
* **మేడ్చల్ జిల్లాలో ఉన్న శ్రీ వైష్ణవులందరూ తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలి**
* **జన గణనలో శ్రీ వైష్ణవుల జనాభా శాతం ఎంత ఉందో తేల్చాలి**

మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుపేదల శ్రీ వైష్ణవులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి ఉచితంగా ఇండ్లను మంజూరు చేయాలని మేడ్చల్ జిల్లా శ్రీ వైష్ణవ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఆరుట్ల కరుణాకరచార్యులు, సంగం రాష్ట్ర ప్రతినిధి మురళి వెంకటాచార్య, అధ్యక్షులు శ్రీకాంత్ కృష్ణమాచార్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, మేడిపల్లి మండలం పీర్జాదిగూడ నగర పరిధిలోని 17వ డివిజన్ విష్ణుపురి కాలనీలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శ్రీవైష్ణవ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద శ్రీవైష్ణవులను ఆదుకోవాలని వారికి ఉచితంగా ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలోని శ్రీ వైష్ణవులందరూ తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని కోరారు. జనగణనలో శ్రీ వైష్ణవుల జనాభా శాతం ఎంత ఉందో తేల్చి చెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీ వైష్ణవులను విస్మరించిందని అన్నారు. మతపరమైన అభివృద్ధితో పాటు శ్రీవైష్ణవలు ప్రతినిధిత్వం చేసే సంఘాలకు సమాజంలో గౌరవాన్ని కల్పిస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలను తెలంగాణ ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. భవిష్యత్‌లో విద్య, ఉపాధి, ఇతర రంగాల్లో శ్రీవైష్ణవలకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత ప్రోత్సాహాన్ని కల్పించే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. సంఘం సలహాదారులు, అప్పులా చార్యులు, శేషాచార్యులు, నర్సింహాచార్యులు, కొమాండూరి శ్రీకాంతాచార్యులు, వీరవెల్లి, శ్రీధరాచార్యులు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# ఫిన్‌టెక్, స్మార్ట్ మొబిలిటీ ఆవిష్కరణలకు
# ప్రపంచ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. హెచ్‌ఐసీసీలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఇన్వెస్టోపియా గ్లోబల్' అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. భౌగోళికంగా చిన్నదైనా.. ఆశయాలు, ఆచరణలో తెలంగాణ చాలా పెద్దదని అన్నారు. "2024 25లో జీఎస్‌డీపీలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతానికి పైగా ఉంది. రాష్ట్రంలో డ్రై పోర్ట్‌లు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్ జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, గ్రీన్ లాజిస్టిక్ హబ్‌లు, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్), మెట్రో ఫేజ్ 2 వంటి ప్రాజెక్టులు పారిశ్రామికాభివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్న ఫ్యూచర్ సిటీ.. ఫిన్‌టెక్, క్లైమేట్ టెక్, స్మార్ట్ మొబిలిటీ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మారబోతోంది. డేటా సెంటర్లు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోంది.

ఏడాదిన్నర వ్యవధిలో కొత్తగా 3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాం. 2024 25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయి. ఇందులో ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషించాయి. ఇప్పటికే యూఏఈకి చెందిన లులు గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు



పెట్టాయి. మరింత మంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. యూఏఈ మాదిరిగానే తెలంగాణ కూడా సమయం, నమ్మకం, పరివర్తనకు విలువ ఇస్తుంది. ఇక్కడ ఏఐ, లైఫ్ సైన్సెస్, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో ఎగుమతులు, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి'' అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

# ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం: ఖర్గే

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో మెజారిటీగా ఉన్నా.. కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యా



సంస్థల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ అన్యాయం జరుగుతోందన్నారు. "దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించలేదు. తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలి. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉంది. ఈ చరిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని బృందానికి కృతజ్ఞతలు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ప్రత్యేక అభినందనలు'' అని మల్లికార్జున ఖర్గే తెలిపారు.

# మీలా ట్యాపింగ్ చేయాల్సిన అవసరం మా సీఎంకు లేదు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి నేతలు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని.. ఆ అవసరం తమ నాయకుడు, సీఎం రేవంత్‌రెడ్డికి లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రేవంత్ సమర్థుడని చెప్పారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. "ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ మాది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వం. మా మంచి పాలనను ఓర్వలేక విష ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్ష పాత్ర కూడా కేసీఆర్ సరిగా నిర్వహించలేకపోతున్నారు. ఇప్పటికే భారాసకు ప్రజలు బుద్ధి చెప్పారు. స్థానిక సంస్థల



ఎన్నికల్లోనూ ఇదే జరుగుతుంది. ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతూ విమర్శించడం సరికాదు. మీలా ట్యాపింగ్‌తో రాజకీయాలు చేయాల్సిన అవసరం మా ముఖ్యమంత్రికి లేదు. మాకు మా నాయకుల మీద నమ్మకం, విశ్వాసం ఉంది. గత ప్రభుత్వంలో భార్యాభర్తలు, సినీతారలు, జడ్జిలు మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేశారు.'' అని ఆది శ్రీనివాస్ అన్నారు.

# నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన మంత్రి సీతక్క

హైదరాబాద్: మంత్రి సీతక్క నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో అప్పటి ప్రభుత్వం సీతక్కతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌పైనా కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా ఆమె ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణను న్యాయస్థానం ఆగస్టు 13కి వాయిదా వేసింది.



# మీ భవిష్యత్తు మా బాధ్యత : మంత్రి శ్రీధర్ బాబు

విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వ(మా) బాధ్యత అనే తలంపుతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. పరిగి మున్సిపాలిటీ పరిధిలోని తుంకులగడ్డ ప్రాంతంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి లతో కలసి శంఖుస్థాపన చేశారు. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే దృఢ సంకల్పంతో ఉందన్నారు. భావితరాలకు బంగారు భవిష్యత్తు కల్పించాలని ఉద్దేశంతో కోట్లాది నిధులను కేటాయించి కులాలకు అతీతంగా విద్యను అభ్యసించేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. కుల వర్గాలతో సంబంధం లేకుండా ఒకే నీడ కింద అందరూ చదువుకోవాలని ఒక మంచి సంకల్పంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనతోపాటు జనరల్,



స్పోర్ట్స్ ఆడిటోరియంలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి కుటుంబంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని సంకల్పాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పరిగి నియోజకవర్గ ప్రాంతానికి సాగునీరు అందించే దిశగా సింహ భాగంగా పనిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. సాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సర్వే నిమిత్తం ప్రభుత్వ ఉత్తర్వులు ఇప్పిస్తానని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సోదరులకు రైతు భరోసా కింద 9 రోజుల్లో 9,000 కోట్ల రూపాయలను అందించడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం రైతు పక్షాన ఉంటుందని, రైతులు నిశ్చితంగా ఉండాలని మంత్రి తెలిపారు. అనంతరం పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల దశా దిశను మార్చే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కుల మతాలకు సంబంధం లేకుండా అందరికీ ఒకే మేధస్సు ఉంటుందని ఆయన అన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను ఎదగడానికి ప్రభుత్వం సహకరిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పరిగి నియోజకవర్గానికి తాగునీటి ప్రాజెక్టుకు తోడ్పాటు అందించాలని ఆయన మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డిఇఓ రేణుకాదేవి, ఆర్డీవో వాసు చంద్ర, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, డిబిసిడిఓ ఉపేందర్, డిఎండబ్ల్యూఓ రాజేశ్వరి, ఈడబ్లూఐడిసి చీఫ్ ఎగ్జిక్యూటివ్ శైలెందర్ రాజ్, తహసిల్దార్ వెంకటేశ్వరి,మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాం రెడ్డి, అధికారులు , ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



# మరోసారి సచివాలయంలో ఊడిన పెచ్చులు

తెలంగాణ సచివాలయంలో మరోసారి పెచ్చులు విరిగిపడ్డ ఘటన చోటుచేసుకుంది. దీనితో సచివాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. భారీ వర్షాల కారణంగా గ్రౌండ్ ఫ్లోర్ లోని రూం నంబర్ 28 వద్ద ఇది జరిగింది. ఈ ఘటన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్ వచ్చే మార్గంలో సంభవించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన సచివాలయ నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తింది. అయితే గతంలో కూడా రెండుసార్లు ఇలా పెచ్చులు ఊడగా... నిర్మాణ సంస్థ చర్యలు చేపట్టింది. కాగా నేడు జరిగిన సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం గాని, ఎవరకైనా గాయాలు సంభవించినట్లు సమాచారం లేదు.

# బండి సంజయ్ పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ



కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. హైదరా బాద్ లోని నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్ట్ ఈ వారెంట్ జారీ చేసింది. అయితే హుజురాబాద్ ఎన్నికల ప్రచార ఉల్లంఘన కేసులో కోర్టు ముందు హాజరవమని ఎన్నిసార్లు నోటీసులు పంపినా బండి సంజయ్ హాజరు కాకపోవడంతో, కోర్ట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాలు నడుస్తున్నాయి కాబట్టి, మరింత సమయం కోరుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ తరపున న్యాయవాది రేపు కోర్టులో రీకాల్ పిటిషన్ దాఖలు చెయ్యనున్నారు. అలాగే ఈనెల 30న కోర్టు ముందు హాజరయ్యేందుకు కూడా అనుమతి కోరనున్నారు.

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు...

**ఐటీ, రియల్టీ రంగాల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి**

**ప్రారంభ లాభాలను నిలబెట్టుకోలేకపోయిన సూచీలు**

**యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ పట్ల ఇన్వెస్టర్ల అప్రమత్తత**




**ముంబై:** భారత స్టాక్ మార్కెట్ నేడు నష్టాలతో ముగిసింది. ముఖ్యంగా ఐటీ, రియల్టీ రంగాల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు పడిపోయాయి. గురువారం సెన్సెక్స్ 542.47 పాయింట్లు (0.66 శాతం) నష్టపోయి 82,184.17 వద్ద ముగియగా, నిఫ్టీ 157.80 పాయింట్లు (0.63 శాతం) తగ్గి 25,062.10 వద్ద స్థిరపడింది.

ఐటీ, కన్స్యూమర్ గూడ్స్, రియల్టీ రంగాలలో అమ్మకాల ఒత్తిడితో మార్కెట్ ప్రారంభంలో వచ్చిన లాభాలను నిలబెట్టుకోలేకపోయింది. సెన్సెక్స్‌లో ట్రెంట్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్, ఇన్ఫోసిస్, కోటక్ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు, ఎటర్నల్, టాటా మోటార్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్ లాభాల్లో ముగిశాయి.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ (2.21 శాతం), నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ (1.12 శాతం), నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (0.62 శాతం), బ్యాంక్ నిఫ్టీ (0.25 శాతం) నష్టాలను చవిచూశాయి. అయితే, పీఎస్‌యూ బ్యాంకులు, హెల్త్‌కేర్, ఫార్మా స్టాక్స్ రాణించాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.58 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.09 శాతం పడిపోయాయి.

భారత రూపాయి అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 86.40 వద్ద ముగిసింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయం కోసం మార్కెట్ భాగస్వాములు అప్రమత్తంగా ఉండడమే ఈ ట్రెండ్ కు కారణమని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు.

## టాటా సన్స్ ఛైర్మెన్‌కు పెరిగిన జీతం..

**155.8 కోట్ల వేతనం అందుకున్న చంద్రశేఖరన్**




**న్యూఢిల్లీ:** టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్ 2024-25 వార్షిక సంవత్సరంలో 155.81 కోట్ల వేతాన్ని ఆర్జించారు. అంతకుముందు వార్షిక సంవత్సంతో పోలిస్తే ఆ మొత్తం 15 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. 2024 వార్షిక సంవత్సరానికి చంద్రశేఖరన్ 135 కోట్లు ఆర్జించారు. కంపెనీ వార్షిక రిపోర్టు ద్వారా ఈ విషయం తెలిసింది. ఫైనాన్షియల్ ఇయర్ 25లో ఆయన జీతం రూపంలో 15.1 కోట్లు, ఇక ఇతర కమీషన్, లాభాల్లో భాగంగా 140.7 కోట్లు ఆర్జించారు. వాస్తవానికి గత వార్షిక సంవత్సరంలో టాటా సన్స్ కంపెనీ తన లాభాల్లో 24.3 శాతం కోల్పోయింది. అయితే అలాంటి సమయంలో టాటా సన్స్ ఛైర్మెన్‌కు జీతాన్ని పెంచడం చర్చనీయాంశమైంది. గత ఏడాది టాటా సన్స్ లాభాలు 34,654 కోట్ల నుంచి రూ.26,232 కోట్లకు పడిపోయాయి.

టాటా సన్స్‌లో చేస్తున్న ఇతరు ఉద్యుగుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరభ్ అగర్వాల్ 2025 వార్సిక సంవత్సరంలో 32.7 కోట్లు ఆర్జించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 7.7 శాతం ఎక్కువ. రతన్ టాటా మృతి తర్వాత టాటా సన్స్‌లో చేరిన నోయల్ టాటాకు 1.42 కోట్ల కమీషన్ వచ్చింది. 2025 మార్చిలో రిటైర్ అయిన మాజీ బోర్డు సభ్యుడు లియో పురికి 3.13 కోట్ల కమీషన్ వచ్చింది. 2024 ఆగస్టులో రిటైర్ అయిన భాస్కర్ భట్ 1.33 కోట్ల కమీషన్ అందుకున్నారు.

## పతంజలి సరికొత్త ప్లాన్..

**నగరాలతో పాటు గ్రామాలలో మెగా స్టోర్లు**




**న్యూఢిల్లీ:** దేశంలో అతిపెద్ద ఆయుర్వేద కంపెనీ అయిన పతంజలి.. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను బలోపేతం చేయడం ద్వారా గ్రాస్‌రూట్ సోర్సింగ్, ఉద్యోగ సృష్టి, విస్తృతమైన రిటైల్ విస్తరణ ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి గణనీయమైన సహకారాన్ని అందిస్తోంది. 2006లో ప్రారంభమైన పతంజలి.. సాంప్రదాయ సరఫరా, ఆధునిక రిటైల్ ఫార్మాట్‌లను ఉపయోగించడం ద్వారా ఉపాధి, వ్యవసాయం, స్థానిక తయారీని పెంచడానికి గణనీయమైన సహకారాన్ని అందించిందని పేర్కొంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి కంపెనీ అనేక చర్యలు తీసుకుందని తెలిపింది. నూనెలు, ధాన్యాలు, మూలికలతో సహా దాని ముడి పదార్థాలలో ఎక్కువ భాగం నేరుగా స్థానిక రైతుల నుండి తీసుకుంటోంది. ఈ విధానం రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా గ్రామీణ భారతదేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతు ఇచ్చిందని కంపెనీ పేర్కొంది.

రైతులకు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చే 'కిసాన్ సమృద్ధి కార్యక్రమం'ను ప్రారంభించడానికి కంపెనీ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, అగ్రికల్చరల్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ప్రయత్నం గ్రామీణ భారతదేశంలో స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని కంపెనీ తెలిపింది.

**మెగా తయారీ యూనిట్ల ద్వారా ఉపాధి అవకాశాలు:**

యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాంతంలో మెగా ఫుడ్ అండ్ హెర్బల్ పార్క్ ఏర్పాటు చేయడం కంపెనీ ఇటీవల చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటి. ఇందులో రూ.500 కోట్ల బిస్కెట్ తయారీ ప్లాంట్, రూ.600 కోట్ల పాల ప్రాసెసింగ్ యూనిట్, రూ.200 కోట్ల హెర్బల్ ఫామ్ ఉన్నాయి. ఈ సౌకర్యాలు స్థానిక నివాసితులకు వేలాది ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని, గ్రామీణ ఉపాధి మార్కెట్‌ను మరింత పెంచుతాయని భావిస్తున్నారు.

**రిటైల్, సరసమైన ఉత్పత్తుల ద్వారా పట్టణ విస్తరణ:**

కంపెనీ తన ఉత్పత్తుల పరిధిని విస్తరించడానికి భారతదేశం అంతటా వేలాది ఫ్రాంచైజీలు, మెగా స్టోర్‌లను తెరిచినట్లు పేర్కొంది. ఈ దుకాణాలు పట్టణ ప్రాంతాల్లో రిటైల్ వాణిజ్యాన్ని పెంచాయని, అలాగే స్థానిక వ్యాపారులకు కొత్త ఆదాయ అవకాశాలను సృష్టించాయని కంపెనీ తెలిపింది. ఉదాహరణకు మెగా స్టోర్‌ను ఏర్పాటు చేయడానికి రూ. 1 కోటి పెట్టుబడి, కనీసం 2,000 చదరపు అడుగుల స్థలం అవసరం. ఇది ప్రతిష్టాత్మక పట్టణ వ్యవస్థాపకులకు బలమైన వ్యాపార అవకాశాన్ని అందిస్తుంది. దాదాపు రూ. 4,350 కోట్ల విలువైన రుచి సోయా కొనుగోలు కూకింగ్ ఆయిల్, ఆహార విభాగాలలో దాని స్థానాన్ని బలోపేతం చేసింది. పట్టణ వినియోగదారులకు మరింత సరసమైన, స్థానికంగా ఉత్పత్తి చేసిన వస్తువులను పొందే అవకాశాన్ని కల్పించింది.

# డకెట్, క్రాలే విధ్వంసం

**రెండో రోజు ఇంగ్లండ్‌దే**



**మాంచెస్టర్:** మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్టులో ఇంగ్లండ్ పట్టుబిగించే దిశగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌ను 358కే ఆలౌట్ చేసిన ఆతిథ్య జట్టు ఆ తర్వాత బజ్ బాల్ ఆటతో రెచ్చిపోయింది. ఓపెనర్లు బెన్ డకెట్ (94), జాక్ క్రాలే (84)లు ఆకాశమే హద్దుగా చెలరేగగా ఆఖరి సెషన్‌లో భారీగా రన్స్ వచ్చాయి. ఈ జోడీని జడేజా విడదీసి బ్రేకివ్వగా.. కాసేపటికే డకెట్‌ను ఔట్ చేసిన అన్షుల్ తొలి వికెట్ సాధించాడు. మొత్తంగా రెండోరోజు స్టోక్స్ సేన ఆధిపత్యంతో మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది.

ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో భారత బ్యాటర్లు తడబడిన చోట ఇంగ్లండ్ ఓపెనర్లు విధ్వంసం సృష్టించారు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపి.. గిల్ సేను ఒత్తిడిలో పడేశారు. బెన్ డకెట్ (90) , జాక్ క్రాలే(84)లు ధనాధన్ ఆడగా 20 ఓవర్లకే స్కోర్ వంద దాటింది. బజ్ బాల్ ఆటతో విరుచుకుపడిన ఈ జోడీని జడేజా విడదీయగా 166 వద్ద ఆతిథ్య జట్టు తొలి వికెట్ కోల్పోయింది. సెంచరీకి చేరువైన డకెట్‌ను అన్షుల్ ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు.

వరుసగా రెండు వికెట్లు పడడంతో స్కోర్ నెమ్మదించింది. ఓలీ పోప్(20 నాటౌట్), జో రూట్(11 నాటౌట్) ఆచితూచి ఆడారు. దాంతో, ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఇంకా 133 కొడితే భారత్ స్కోర్ దాటేస్తుంది స్టోక్స్ సేన. భారత జట్టు మ్యాచ్‌లో నిలవాలంటే మూడో రోజు తొలి సెషన్‌లో బౌలర్లు నిప్పులు చెరగాలి. లేదంటే ఆశలు వదిలేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

**శార్దూల్, పంత్ పోరాడినా..**

అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో కీలకమైన మాంచెస్టర్ టెస్టులో భారత జట్టు మంచి అవకాశాన్ని చేజార్చుకుంది. సాయి సుదర్శన్(61) యశస్వీ జైస్వాల్(58)లు శార్దూల్ ఠాకూర్(41), వాషింగ్టన్ సుందర్(27) రాణించినా.. లంచ్ తర్వాత టకటకా వికెట్లు కోల్పోయి 358 పరుగులకే కుప్పకూలింది. పాదం నొప్పిని పంటిబిగువన భరిస్తూనే రిషభ్ పంత్(54).. సమయోచిత బ్యాటింగ్‌తో శార్దూల్ ఠాకూర్(41) పోరాడినా బెన్ స్టోక్స్ (5-72) దెబ్బకొట్టాడు. ఐదు వికెట్లుతో చెలరేగిన ఇంగ్లండ్ సారథికి స్పీడ్‌స్టర్ ఆర్చర్ కూడా తోడవ్వడంతో రెండో సెషన్‌లో కాసేపటికే గిల్ సేన ఇన్నింగ్స్ ముగిసింది.

## బెంగళూరు తొక్కిసలాట..

**ఆర్‌సీబీ-కేఎస్‌సీఏపై చర్యలకు కేబినెట్ నిర్ణయం..!**

**బెంగళూరు:** బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా ఇచ్చిన నివేదికను కర్నాటక మంత్రివర్గం ఆమోదించింది. జూన్ 4న డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ వంటి సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులపై శాఖాపరమైన విచారణను ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. తొక్కిసలాట, నిర్లక్ష్యానికి కారణమైన వారి పేర్లను జస్టిస్ డి'కున్హా నివేదికలో పేర్కొన్నారని చెప్పారు.






స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించగా.. పెద్దసంఖ్యలో గాయపడ్డారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రైవేట్ సంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించిందని సమావేశం తర్వాత కర్నాటక శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా నివేదికను ఆమోదించి.. దాని ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రైవేటు సంఘాలు, ఆర్‌సీబీ, కర్నాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, తొక్కిసలాట ఘటన తర్వాత జూన్ 5న సీఎం సిద్ధరామయ్య న్యాయ విచారణకు ఆదేశించారు. ఈ ఘటనలో బెంగళూరు పోలీస్ కమిషనర్ బీ దయానంద్, అదనపు కమిషనర్ (పశ్చిమ) వికాస్ కుమార్ వికాస్‌లను సస్పెండ్ చేశారు. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్-18వ ఎడిషన్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తొలిసారి గెలిచింది. దాంతో ఆర్‌సీబీ ఫ్రాంచైజీ నిర్వహించిన విజయోత్సవ పరేడ్ నిర్వహించగా.. పెద్ద ఎత్తున అభిమానులు తరలిరావడం.. స్టేడియం వెలుపల భారీగా జనం గుమిగూడడంతో తొక్కిసలాట చోట చోటు చేసుకుంది.

## ఇంగ్లండ్‌తో టీ20, వన్డే సిరీస్..

**కోహ్లీ, రోహిత్‌కు అవకాశమిస్తారా..!**

**న్యూఢిల్లీ:** అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో తలపడుతున్న భారత జట్టు మరోమారు ఆ దేశం వెళ్లనుంది. ప్రస్తుతం ఐదు టెస్టుల సిరీస్ విజయంపై కన్నేసిన టీమిండియా.. వచ్చే ఏడాది జరుగనుంది. చివరిదైన ఐదో టీ20 (జూలై 11)కి సౌతాంప్టన్ వేదిక కానుంది.

అనంతరం రెండు రోజుల విరామం తర్వాత వన్డే సిరీస్‌లో భారత్, ఇంగ్లండ్ ఎదురుపడనున్నాయి. ఇరుజట్ల మధ్య జూలై 14న వన్డే సిరీస్ ప్రారంభం అవుతుంది. జూలై




పొట్టి వరల్డ్ కప్ ముగిశాక ఇంగ్లండ్‌తో వైట్ బాల్ సిరీస్ ఆడనుంది. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి గురువారం ధ్రువీకరించింది. ఇరు జట్ల మధ్య జూలైలో మొదలు కాబోయే టీ20, వన్డే మ్యాచ్‌ల షెడ్యూల్‌ను బీసీసీఐ విడుదల చేసింది.

వచ్చే ఏడాది భారత జట్టు ఐదు టీ20లు, మూడు వన్డేల కోసం ఇంగ్లండ్ వెళ్లనుంది. ఇరుజట్ల మధ్య జూలై 1న దర్హం వేదికగా తొలి టీ20తో సిరీస్ షురూ కానుంది. ఓల్డ్ ట్రఫోర్డ్‌లో జూలై 4న రెండో మ్యాచ్, మూడో టీ20 ట్రెండ్ బ్రిడ్జ్‌లో.. బ్రిస్టల్‌లో జూలై 7న నాలుగో మ్యాచ్ 16న కార్డిఫ్‌లో రెండో వన్డే, లార్డ్స్ మైదానంలో మూడో వన్డే జూలై19న నిర్వహించనున్నారు.

**ఎంపిక చేస్తారా? లేదా?**

మరి ఈ పర్యటనకు సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను ఎంపిక చేస్తారా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ దిగ్గజ ఆటగాళ్లు వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. పైగా వన్డే సారథిని బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ పర్యటనకు వన్డే సిరీస్ జట్టు కూర్పులో ఎవరెవరు ఉంటారు? అనేది ఆసక్తికరంగా మారింది.

## ఆసియాకప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్..

**తటస్థ వేదికల్లో ఆడేందుకు బీసీసీఐ గ్రీన్‌సిగ్నల్..!**

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆసియా కప్ జరగాల్సి ఉంది. అయితే, ఈ టోర్నీ షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్‌లో ఉండొచ్చని తెలుస్తున్నది. భారత క్రికెట్ నియంత్రణ బోర్డు ఈ టోర్నమెంట్‌ను తటస్థ వేదికలో నిర్వహించడానికి అంగీకరించింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ నుంచి ఉటంకిస్తూ.. పీటీఐ బీసీసీఐ సెప్టెంబర్‌లో యూఏఈ ఆసియా కప్‌ను నిర్వహించే అవకాశం ఉంది. టోర్నీలో భారతదేశం-పాకిస్తాన్ మ్యాచ్ జరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉంటే ఆసియా కప్‌కు సంబంధించి కొద్దిరోజుల్లే ప్రకటన వెలువడే అవకాశం ఉందని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా తెలిపారు. తమ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఏసీసీ సమావేశానికి హాజరయ్యారు. ఆయన సభ్యులకు వివరిస్తారని.. కొన్నిరోజుల్లో అధికారికంగా అన్ని విషయాలు తెలుసుకుంటారని.. తాను ఊహాగానాలను నమ్మనని సైకియా పేర్కొన్నారు. ఆసియా కప్‌ను యూఏఈ నిర్వహిస్తున్నందున భారత జట్టు పాక్‌తోను బీసీసీఐ ఆడుతుందని ఏసీసీ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా తెలిపింది. ఆసియా కప్ వేదికపై చర్చించేందుకు సభ్యదేశాలన్నీ ఏసీసీ సభ్యదేశాలన్నీ సమావేశమైన విషయం తెలిసిందే. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. సెప్టెంబర్‌లో పక్షం రోజుల పాటు ఈ టోర్నీ జరుగనున్నది. ఇదే నెల చివరి వారం నుంచి వెస్టిండిస్‌తో భారత్ టెస్ట్ సిరీస్ ఆడనున్నది. ఢాకాలో ఏసీసీ చైర్మన్, పాకిస్తాన్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ కూడా ఈ కాంటినెంటల్ ఈవెంట్‌లో ఇండో-పాక్ మ్యాచ్‌పై ప్రశ్నించగా.. త్వరలోనే వివరాలను ప్రకటిస్తామన్నారు.






బీసీసీఐతో చర్చలు జరిపామని.. కొన్ని సమస్యలు త్వరలోనే కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. 25 మంది సభ్యుల్లో డైరెక్టర్‌గా కొందరు, మరికొందరు వర్చువల్‌గా పాల్గొన్నారని నఖ్వీ తెలిపారు. అయితే బీసీసీఐ ఒత్తిడి నేపథ్యంలో ఎజెండాలోని పది అంశాల్లో కేవలం రెండింటిపై మాత్రమే చర్చించినట్లు సమాచారం.

# పవన్ వీరవిహారం హరిహరవీరమల్లు

### ఆకట్టుకున్న పవన్ నటన

టాకీస్: పవన్‌కల్యాణ్ సినిమా అంటే అభిమానులకే కాదు, బాక్సాఫీస్‌కూ అదో పెద్ద పండగే.సుదీర్ఘ విరామం తర్వాత పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా 'హరి హర వీరమల్లు' విడుదలయ్యింది. పవన్ కెరీర్‌లో నటిస్తున్న తొలి పీరియాడిక్ మూవీ కావడం, ఏపీ డిప్యూటీ–సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. పైగా పవన్ స్వయంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఆ అంచనాలు పెరిగాయి. 16వ శతాబ్దంలో మొదలయ్యే కథ ఇది. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దిల్లీ పీఠంపై కూర్చొని ఎన్నెన్నో దురాగతాలకి పాల్పడుతూ పాలన కొనసాగిస్తుంటాడు. మత మార్పిడి కోసం దేశ ప్రజలని బలవంతం చేస్తుంటాడు. అందుకు ఒప్పుకోకుండా హిందువులుగానే జీవించేవాళ్ల నుంచి జిజియా పన్ను వసూలు చేస్తుంటాడు. మరోపక్క ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా, వాళ్లని పట్టించు కోకుండా దేశ సంపదని తెల్లదొరలు దోచుకెళ్తుంటారు. వాళ్లకు అనుకూలంగా కొద్దిమంది రాజులు, వాళ్ల అనుచరులు పనిచేస్తూ ఉంటారు. వాళ్లందరికీ వీర మల్లు (పవన్ కల్యాణ్) అంటే హడల్. పెద్దవాళ్ల దగ్గరున్న సంపదని దోపిడీ చేసి పేదలకి పంచిపెడుతుంటాడు. బందరు నుంచి హైదరాబాద్ నవాబ్ కుతుబ్ షాహీ దగ్గరకు తీసుకెళుతున్న వజ్రాలపై కన్నేస్తాడు వీరమల్లు. తన బలగంతో చార్మినార్ వరకూ వచ్చి మరీ వజ్రాల్ని కాజేస్తాడు. అతని వీరత్వం గురించి తెలుసుకున్న కుతుబ్ షాహీ దిల్లీలో ఔరంగజేబు సింహాసనం పై ఉన్న కోహినూర్ వజ్రాన్ని తీసుకొచ్చే బాధ్యతని అతడికి అప్పజెబుతాడు. ఏ కారణాలతో అందుకు వీరమల్లు ఒప్పుకున్నాడు?హైదరాబాద్ నుంచి దిల్లీకి వెళ్లే క్రమంలో ఆయనకి ఎదురైన పరిస్థితులు ఎలాంటివి అన్నదే సినిమా కథ. మొత్తంగా ఈ మూవీలో పవన్ వీరవిహారం చేశాడనే చెప్పాలి. ఈ కథలో పంచమి (నిధి అగర్వాల్) ఎవరు ఆమెకీ వీరమల్లుకూ సంబంధం ఏమిటి.శత్రుదుర్భేధ్యమైన ఔరంగజేబు సామ్రాజ్యంలోకి వీరమల్లు ఎలా వెళ్లాడనేది చిత్ర కథ. చారిత్రాత్మక నేపథ్యం కారణంగా ఈ కథకి అలాంటి ఇబ్బందేమీ కలగలేదు. ఇప్పుడు ఎక్కువగా మాట్లాడుకుంటున్న సనాతన ధర్మం నేపథ్యాన్ని ఇందులో బలంగా స్పృశించారు. రాబిన్‌హుడ్ తరహా కథానాయకుడి పాత్రతోనూ, అభిమానుల్లో పూనకాలు తెప్పించే ఎలివేషన్స్‌తోనూ... ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయ్యే స్వధర్మం నేపథ్యంతోనూ తెరకెక్కడం ఈ సినిమాకి కలిసొచ్చాయి.



కథానాయకుడు కోహినూర్ కోసం దిల్లీకి వెళ్లే క్రమంలో ఎదురయ్యే పరిస్థితులే ఇందులో కీలకం. వీరమల్లు పాత్రకు పవన్ జీవం పోశాడనే చెప్పాలి. ప్రథమార్ధంలో యాక్షన్ సీక్వెన్స్, పాటలు సినిమాకి ప్రధాన ఆకర్షణ. ముఖ్యంగా పోర్ట్‌లో ఫైట్, అందులో ఎలివేషన్స్ అభిమానులని మరింతగా అలరిస్తాయి. ఆ తర్వాత మల్లయోధులతో, కొనసాగింపుగా చార్మినార్ దగ్గర సాగే పోరాట సన్నివేశాలతోనూ, 'కొల్లగొట్టినాదిరో' పాటతోనూ ఫస్ట్ హాఫ్ సినిమా అంచనాలకి దీటు–గానే సాగుతుంది. విరామానికి ముందు కుతుబ్ షాహీ కోటలోని సన్నివేశా లు మరింతగా అలరించడంతోపాటు–, ద్వితీయార్ధంపై మరింతగా ఆసక్తిని రేకెత్తిస్తాయి. హరి హర వీర మల్లు పాత్రలో ఒదిగిపోయారు. వీరమల్లుగా ఆయన కనిపించిన విధానం, అందులో చూపించిన హీరోయిజం, ఆయన చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకి ప్రాణం పోశాయి. సుదీర్ఘకాలంపాటు– సినిమా సాగినా లుక్ పరంగా ఏమాత్రం వ్యత్యాసం కనిపించలేదు. క్రూరమృగాల నేపథ్యంలో వచ్చే సన్నివేశాల్లోనూ, సనాతన ధర్మం ఇతివృత్తంగా సాగే సన్నివేశాల్లో ఆయన భావజాలమే కనిపిస్తుంది. నిధి అగర్వాల్ పంచమి పాత్రలో ఆకట్టుకుంటుంది. కొల్లగొట్టినాది రో, తార తార పాటల్లో మరింత అందంగా కనిపించింది. ఆమె లుక్‌లో కూడా తేడాలేమీ కనిపించలేదు. ఔరంగజేబు పాత్రలో బాబీ దేవోల్ కనిపించిన తీరు ఆకట్టుకుంటుంది. అయితే ప్రథమార్ధంలో కనిపించినంత బలంగా ద్వితీయార్ధంలో ఆ పాత్రని చూపించలేకపోయా రు. దివంగత నటుడు కోట శ్రీనివాసరావు చిన్న పాత్రలో మెరుస్తారు. మురళీశర్మ, సచిన్ ఖేడ్కర్, సత్యరాజ్ తదితరులు అలవా–టైన పాత్రల్లో కనిపిస్తారు. సునీల్, నాజర్, సుబ్బరాజు, అయ్యప్ప శర్మ, కబీర్ దుహాన్ సింగ్ తదితరులు పవన్‌కల్యాణ్ జట్టుగా కనిపిస్తారు. అనసూయ, పూజిత పొన్నాడ ఓ పాటలో సందడి చేస్తారు. సాంకేతిక విభాగాల్లో కీరవాణి సంగీతం ప్రధానం. నేపథ్య సంగీతంతో సినిమాకి ప్రాణం పోశారు. సంగీతంతోనే హీరోయిజాన్ని పతాక స్థాయిలో నిలబెట్టారు. 'జనం మెచ్చే సైనికుడు అవుతాడు... జనసైనికుడు అవుతాడు', 'పాలించేవారి పాదాలే కాదు, తల కూడా కనిపించాలి' అంటూ పవన్ రాజకీయ జీవితం, ఆయన వ్యక్తిత్వా న్ని ప్రతిబింబించేలా ఇందులో మాటలు రాశారు సాయిమాధవ్ బుర్రా అండ్ కో. మొత్తంగా పవన్ అభిమానులు కోరుకున్న విధంగా చిత్రం ఉందనడంలో సందేహం లేదు.

## చాలా ఆసక్తిగా ఉన్నా: పెళ్లిపై మృణాళ్ ఠాకూర్ కామెంట్స్



టాకీస్: తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ మృణాళ్ ఠాకూర్. ఈ భామ ప్రస్తుతం టాలీవుడ్ హీరో అడివిశేష్ నటిస్తోన్న డెకాయిట్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. మరోవైపు బాలీవుడ్ యాక్టర్ అజయ్ దేవ్‌గన్ నటిస్తోన్న సన్ ఆఫ్ సర్దార్ 2లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ప్రొఫెషనల్‌గా బిజీగా ఉన్న ఈ సుందరి తన వ్యక్తిగత జీవితం గురించి చెప్పిన మాటలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఏంటీ మృణాళ్ ఠాకూర్ షేర్ చేసింది పెళ్లి విషయమా.. ఏంటని ఆలోచిస్తున్నారా..? అయితే మీరనుకుంటున్నది నిజమే. కపిల్ శర్మతో చేసిన మృణాళ్ ఠాకూర్ చిట్‌చాట్‌లో ఇంట్రెస్టింగ్ విషయాన్ని వెల్లడించింది. తాను పెళ్లి చేసుకోవడం, పిల్లలను కనే విషయంలో చాలా ఆసక్తిగా ఉన్నట్టు వెల్లడించింది మృణాళ్ ఠాకూర్. అంతేకాదు తల్లి కావడం తనకు ఎప్పటి నుంచో ఉన్న కల అని కూడా చెప్పుకొచ్చింది. అయితే ఇప్పుడు మాత్రం పెళ్లికి సంబంధించి ఎలాంటి ప్లాన్ లేదని.. ప్రస్తుతానికి ఫోకస్ అంతా కెరీర్‌పైనే పెట్టానని స్పష్టం చేసింది. ఇక నిజాయితీ తన మనసులో మాట బయటపెట్టిన మృణాళ్ ఠాకూర్‌పై అంతా ప్రశంసలు కురిపిస్తున్నారు.

షనీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న డెకాయిట్ డిసెంబర్ 25న విడుదల కానుంది. డెకాయిట్ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్‌లో మృణాల్ ఠాకూర్ ఓ చేత్తో స్టీరింగ్ తిప్పుతూ.. మరోచేతిలో పిస్తోల్ పట్టుకొని కనిపిస్తుంది. పక్కనే అడివి శేష్ సిగరెట్ వెలిగిస్తున్నాడు. హీరోహీరోయిన్లిద్దరూ ఏదో మిషన్‌లో పాల్గొంటున్నట్టుగా ఉన్న ఈ పోస్టర్ డెకాయిట్‌లో సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. మృణాళ్ ఠాకూర్ మరో నాలుగు సినిమాలను కూడా లైన్‌లో పెట్టింది.




## అందం ఉన్నా అదృష్టం కలిసిరాని చిన్నది..

### గ్లామర్ పాత్రలతోనే ఫేమస్..

టాకీస్: ఫస్ట్ మూవీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఓ హీరోయిన్.. ఆ తర్వాత వరుస సినిమా అవకాశాలు అందుకుంటుదని అనుకున్నారు. కానీ అలా జరగలేదు. ఆడపాదడపా చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. కానీ ఇప్పుడు సరైన సక్సెస్ కోసం వెయిట్ చేస్తుంది. సినిమా ఇండస్ట్రీలో నటిగా సక్సెస్ కావాలంటే అందం, అభినయం ఉన్నప్పటికీ కాస్త అదృష్టం కూడా ఉండాల్సిందే. హీరోయిన్స్ విషయంలో గ్లామర్ పాత్రతోపాటు.. సక్సెస్ అయ్యేందుకు అదృష్టం సైతం కలిసిరావాలి. పైన ఫోటోలో కనిపిస్తున్న ఈ చిన్నది ఫస్ట్ మూవీతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. మొదటి చిత్రంలోనే బోల్డ్ సన్నివేశాల్లో రెచ్చిపోయింది. దీంతో ఒక్కసారిగా ఫిల్మ్ వర్గాల్లో ఈ అమ్మడు హాట్ టాపిక్ అయ్యింది. తొలి చిత్రం సూపర్ హిట్ కావడంతో ఈ బ్యూటీ పేరు మారుమోగింది. ఆ తర్వాత ఆమెకు వరుస అవకాశాలు వస్తాయని భావించారు అంతా. కానీ అలా జరగలేదు. అందం, అభినయంతో కట్టిపడేసినప్పటికీ అనుకున్నంత స్థాయిలో మాత్రం అవకాశాలు రాలేదు. దీంతో ఆడపాదడపా చిత్రాల్లో నటించి మెప్పించింది. అందంతో కుర్రకారు హృదయాలు కొల్లగొట్టిన ఈ చిన్నది కెరీర్ విషయంలో మాత్రం ఆశించిన స్థాయిలో అవకాశాలు అందుకోలేక పోయింది. తెలుగులో వరుసగా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఈ బ్యూటీకి సరైన బ్రేక్ మాత్రం రాలేదు. అలాగే ఎక్కువగా గ్లామర్ పాత్రలతో పేమస్ అయ్యింది. ఆమె మరెవరో కాదు.. పాయల్ రాజ్ పుత్. ఆర్ఎక్స్ 100 సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీతోనే భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఆ త్రవాత వెంకీమామ, డిస్కో రాజా వంటి చిత్రాల్లో నటించినప్పటికీ బ్రేక్ మాత్రం రాలేదు. ఇక కొన్నాళ్ల క్రితం డైరెక్టర్ అజయ్ భూపతి నటించిన మంగళవారం చిత్రంలో నటించింది. ఈ సినిమాలో బోల్డ్ పాత్రలో నటించింది. ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగుతోపాటు తమిళంలోనూ పలు చిత్రాల్లో నటిస్తుంది. కానీ ఇప్పటివరకు ఆమెకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ నిత్యం క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తుంది.

## కొత్త అవతారమెత్తిన సదా..

**టాకీస్:** సదా పేరు చెబితే చాలామందికి 'జయం' సినిమాలో ఆమె చెబుతున్న "వెళ్ళవయ్యా వెళ్ళు" అనే డైలాగ్ వెంటనే గుర్తొస్తుంది. ఆ సినిమా ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ, తన టాలెంట్‌తో అతి తక్కువ సమయంలో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అంతేకాదు, లెజెండరీ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అపరిచితుడు'లో అవకాశం దక్కించుకుంది. దీంతో సౌత్ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయినా, ఆమె కెరీర్ ఊహించినంత ముందుకు సాగలేదు.



'అపరిచితుడు' తర్వాత సదా సరైన స్క్రిప్టులు ఎంచుకోలేకపోయింది. వరుస ఫ్లాపులతో ఆమె క్రేజ్ తగ్గుతూ వచ్చింది. సినిమాలు ఆశించిన స్థాయి చేరకపోవడంతో పాటు, కొన్ని గోల్డెన్ ఆఫర్స్‌ను వదులుకోవడం కూడా ఆమె కెరీర్‌కు ఎదురుదెబ్బ అయ్యింది. చంద్రముఖి సినిమాలో మొదటగా జ్యోతిక పాత్రకు సదాకే అవకాశం వచ్చింది. కానీ 'అపరిచితుడు' షూటింగ్ కారణంగా డేట్స్ కుదరక, ఆ అవకాశాన్ని కోల్పోయింది. శేఖర్ కమ్ముల 'ఆనంద్' చిత్రం కోసం కూడా మొదటగా సదానే అని అనుకున్నారు. కానీ ఆమె ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించడంతో మరో హీరోయిన్‌కి ఆ అవకాశం దక్కింది.

ఇలా సదా అప్పుడు తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో తన కెరీర్ సందిగ్ధంలో పడ్డట్టు అయింది. అయితే సిల్వర్ స్క్రీన్ దూరమైనా, సదా బుల్లితెరపై కొన్నాళ్లు తన హవా కొనసాగించింది. 'ఢీ', 'నీతోనే డాన్స్' వంటి డ్యాన్స్ షోలు జడ్జిగా హాజరై మళ్లీ పాపులారిటీ తెచ్చుకుంది. అయితే ఇటీవలి కాలంలో సినిమా, టీవీ రెండినీ కూడా పక్కనపెట్టి సదా పూర్తిగా కొత్త దిశగా అడుగులు వేసింది. సదా ఇప్పుడు కెమెరా ముందుకు కాకుండా కెమెరా వెనకకు వెళ్లింది! ఆమె ప్రస్తుతం వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీపై పూర్తిగా ఫోకస్ పెట్టింది. అడవుల్లో జంతువుల వీడియోలు చిత్రీకరించి షేర్ చేస్తోంది.ఇటీవల ఆమె తన నికాన్ కెమెరాతో ఆఫ్రికా అడవుల్లో ఓలోమిన జాతికి చెందిన సింహాన్ని చిత్రీకరించింది. ఆ సింహం స్లోమోషన్‌లో నడుస్తున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటిని చూసినవారంతా సదా ఫోటోగ్రఫీ టాలెంట్‌కి ఫిదా అయ్యారు.

## విజయ్ దేవరకొండకు మరోసారి ఈడీ నోటీసులు

**టాకీస్:** బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో హీరో విజయ్ దేవరకొండకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి నోటీసులు జారీచేసింది. వచ్చే నెల 11న విచారణకు రావాలని ఆదేశించింది. అయితే ఇప్పటికే విజయ్‌తోపాటు రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, మంచు లక్ష్మి తదితరులకు ఈడీ తాఖీదులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న విచారణకు రావాలని తెలిపింది. అయితే ముందస్తు కార్యక్రమాలు, సినిమా షూటింగ్‌లు ఉన్న కారణంగా ఆ రోజున విచారణకు హాజరుకాలేనని విజయ్ దేవరకొండ ఈడీకి సమాచారం ఇచ్చారు. మరో తేదీ కావాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 11న కచ్చితంగా విచారణకు



రావాలంటూ తాజాగా స్పష్టంచేసింది. ఇకే కేసులో రానా దగ్గుబాటిని కూడా అదే రోజున విచారించనుంది.

మరోవైపు నటులు ప్రకాశ్‌రాజ్ ఈ నెల 30న, మంచులక్ష్మి ఆగస్టు 13 తేదీల్లో తమ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చింది. కాగా, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి ఈడీ మనీలాండరింగ్ కోణంలో విచారణ జరుపుతోంది. ఈ యాప్‌ల ద్వారా కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయని ఈడీ అనుమానిస్తోంది. దీంతో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సినీ సెలబ్రిటీలు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఈడీ కేసులు నమోదు చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.